జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | ఆదివారం 4 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 235 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com





WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఎడ్యూకేషన్ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528




## ఉగ్రవాదుల్నే కాదు మద్దతుదారుల అంతు కూడా చూస్తాం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పని చేస్తాం
- ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణ తలపిస్తోంది
- ఈ ఉగ్రవాద చర్య పాకిస్తాన్ భూ భాగం నుంచే జరిగిందేనని బలంగా నమ్ముతున్న భారత్

# ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతి

- రాజధాని పునఃప్రారంభ పనుల కార్యక్రమం విజయవంతం
- ప్రజలకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు
- అన్ని ప్రాంతాల సమగ్ర అభివద్ధి సాధించి.. మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం
- ప్రజల సహకారంతో, కేంద్ర మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సష్టించేలా



**అమరావతి**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా రాజధాని అమరావతి పనులు పునః ప్రారంభమయ్యాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ప్రజల సహకారంతో, కేంద్ర ప్రభుత్వ - మిగతా3లో



## రేషన్‌కార్డుదారులకు నో చింత

- కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు కసరత్తు చేపట్టిన సర్కార్
- కార్డుల జారీకి ముందు రేషన్‌కార్డుకు ఈ కేవైసీ ప్రక్రియను మొదలు
- ఈ కేవైసీనీ చేసుకునేందుకు గడువును పెంచుతూ నిర్ణయం
- బోగస్ కార్డులను ఏరివేయడంతో పాటు రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ కేవైసీ ప్రక్రియ



## వ్యాక్సిన్ తీసుకున్నా.. ఏడేళ్ల చిన్నారికి రేబిస్ వ్యాధి

- వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా ఆమెకు రేబిస్ సోకినట్లు గుర్తింపు
- వ్యాక్సిన్ చివరి డోసు తీసుకోవడానికి ముందు వ్యాధి నిర్ధారణ

## పాక్‌పై మరిన్ని ఆంక్షలు..

- పాకిస్తాన్ ఓడలపై భారత్ నిషేధం
- అన్ని రకాల మెయిల్స్, పార్సిళ్ల ఎక్స్ఛేంజీ నిలిపివేత
- వాయు, ఉపరితల మార్గాల్లో వచ్చే మెయిల్స్, పార్శిళ్లపై ఆంక్షలు
- జాతీయ భద్రతా సమస్యల నేపథ్యంలో ఈ నిర్ణయం
- అంతకుముందు పాక్ నుంచి వచ్చే అన్ని రకాల దిగుమతులపై నిషేధం విధించిందిన విషయం తెలిసిందే








## చంద్రబాబూ.. రైతుల గోడు వినిపించడం లేదా?

- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్
- కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడదు
- కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులూ రాక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు
- మీరు, మీ మంత్రులు, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా?



**తాడేపల్లి**

ఏపీలో రైతుల ఆందోళనలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ స్పందించారు. కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఇది న్యాయమేనా? అని ప్రశ్నించారు. జిల్లాల్లో రైతులు ఆందోళనలు చేస్తుంటే, ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా.. 'చంద్రబాబు.. కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా వారి గోడు పట్టించుకోవడం లేదు. కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులూ రాక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. మీరు, మీ మంత్రులు, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా? మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశెనగ, టమోటా, అరటి, చీని, - మిగతా3లో



## శరవేగంగా బుల్లెట్ రైలు స్టేషన్ పనులు

- బి3 బేస్‌మెంట్ స్థాయి, స్టేషన్ గోడల బలోపేతం పూర్తయింది
- అదే సమయంలో సొరంగం పనులు చాలా వేగంగా జరుగుతున్నట్లు వెల్లడి : రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

# ఉగ్రవాదుల్నే కాదు మద్దతుదారుల అంతు కూడా చూస్తాం



**న్యూఢిల్లీ:** ఉగ్రవాదుల్ని, వారి మద్దతు దారుల అంతు చూస్తామని మరోసారి హెచ్చరించారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. మానవాళికి ఉగ్రవాదం అనేది అతి పెద్ద వినాశనకారి అని పేర్కొన్న మోదీ.. ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఉగ్రదాడి తర్వాత మోదీ మాట్లాడుతూ.. పహల్గామ్ పై ఘటనకు బాధ్యులైన వారిని ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రస్తక్తే లేదన్నారు. వారిని మట్టిలో కలిపేస్తామంటూ మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తాజాగా మరోసారి ఉగ్రచర్యలకు సంబంధించి హెచ్చరికలు జారీ చేశారు. శనివారం అంగోలా అధ్యక్షుడు మాన్యుయెల్ గొంకాల్వ్స్ లౌరెంకోతో కలిసి జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మోదీ.. ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మాన్యుయెల్ గొంకాల్వ్స్ లౌరెంకో భారత్ కు వచ్చిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్తాన్ ల మధ్య యుద్ధ వాతావరణ తలపిస్తోంది. ఈ ఉగ్రవాద చర్య పాకిస్తాన్ భూ భాగం నుంచే జరిగిందేనని బలంగా నమ్ముతున్న భారత్.. ఆ మేరకు ఆంక్షలు విధిస్తూ వస్తోంది. పాకిస్తాన్ ను అష్టదిగ్బంధనం చేసి ఉక్కిరి బిక్కిరి చేసే యత్నాలను ఇప్పటికే భారత్ ప్రారంభించింది. పాకిస్తాన్ పౌరులు భారత్ ను విడిచి వెళ్లిపోవాలనే ఆదేశాల దగ్గర్నుంచి పలు నిషేధాజ్ఞల్ని భారత్ అమలు చేస్తూ వస్తోంది. సింధూ జలాలను పాక్‌కు వెళ్లకుండా నిలిపివేయడం, భారత్‌లో పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖుల యూట్యూబ్ చానెళ్ల నిలిపివేత, భారత్ జలాల్లోకి పాక్ ఓడలు రాకుండా నిషేధం, పాక్ దిగుమతులపై నిషేధం ఇలా పలు రకాలైన ఆంక్షలతో పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు అసువులు బాసిన నేపథ్యంలో భారత్ తీవ్రంగా స్పందించింది. పాకిస్తాన్ కు ఒకవైపు హెచ్చరికలు పంపుతూనే, ఏ క్షణంలో ఏం జరిగిన భారత బలగాలు సిద్ధంగా ఉండాలనే స్వేచ్ఛను కూడా వారికి అప్పగించింది. దాంతో పాకిస్తాన్ ఏమైనా కవ్వింపు చర్యలకు పాల్పడి యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తే అందుకు బదులు తీర్చుకునేందుకు భారత్ సిద్ధంగా ఉంది.

# పాక్‌పై మరిన్ని ఆంక్షలు



**ఢిల్లీ:** పెహల్‌గామ్ ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇస్లామాబాద్‌కు షాకులమీద షాకులిస్తోంది. దాయాది దేశంతో ఉన్న అన్ని సంబంధాలను తెంచుకుంటోంది. ఇప్పటికే పలు ఒప్పందాలను నిలిపివేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా పాక్‌పై పలు కఠిన ఆంక్షలను విధిస్తోంది. తాజాగా పాక్ నుంచి వచ్చే అన్ని రకాల మెయిల్స్, పార్సిళ్ల ఎక్స్ఛేంజీని నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వాయు, ఉపరితల మార్గాల్లో వచ్చే మెయిల్స్, పార్శిళ్లపై ఆంక్షలు విధించింది. ఈ మేరకు కేంద్ర కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు పాక్ నుంచి వచ్చే అన్ని రకాల దిగుమతులపై నిషేధం విధించిందిన విషయం తెలిసిందే.

**పాకిస్థాన్ షిప్‌లను నిషేధించిన భారత్**

పాకిస్థాన్ షిప్‌లు భారత జలాలతోపాటు పోర్టుల్లోకి ప్రవేశించడాన్ని భారత్ నిషేధించింది. పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ శనివారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 'పాకిస్థాన్ జెండా కలిగిన ఓడలు భారతదేశంలోని ఏ పోర్టులోకి ప్రవేశించడానికి అనుమతించబోం. అలాగే భారతీయ షిప్‌లు పాకిస్థాన్‌లోని ఏ పోర్టును సందర్శించకూడదు' అని ఆ ఉత్తర్వులో పేర్కొంది. జాతీయ భద్రతా సమస్యల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ తెలిపింది. 'భారతీయ ఆస్తుల భద్రత, సరుకు రవాణా, అనుసంధాన మౌలిక సదుపాయాల ప్రయోజనాల కోసం, భారత షిప్పింగ్ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ చర్య తీసుకున్నాం' అని ఆ ఉత్తర్వులో పేర్కొంది. అదేవిధంగా తమ షిప్‌లు కూడా పాక్ జలాలు, పోర్టులవైపు వెళ్లొద్దని సూచించింది.

**పాకిస్తాన్ ఓడలపై భారత్ నిషేధం**

పాకిస్తాన్‌కు భారత్ వరుస షాకులిస్తోంది. ఇవాళ పాకిస్తాన్ ఓడలపై కేంద్రం నిషేధం విధించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ నోటిఫకేషన్‌లో పాకిస్తాన్ జెండా ఉన్న ఏ ఓడ భారత జలాలలోకి, పోర్టుల్లోకి ప్రవేశించవద్దని ఆదేశించింది. భారత ఓడలేవి పాకిస్తాన్ పోర్టుల్లోకి వెళ్ళొద్దని సూచించింది. భారత్ ఆస్తులను, కార్గో , మౌలిక సదుపాయాలను రక్షించే క్రమంలో ఓడరేవుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. పాకిస్తాన్ విమానాలకు ఇప్పటికే గగనతలం నిషేధం విధించింది భారత్. తాజాగా సముద్ర మార్గాన్ని సైతం బ్యాన్ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇలా పాక్ అన్ని మార్గాల్లో నిషేధం విధిస్తూ అష్ట

# రష్యా విక్టరీ డే వేడుకలు.. రాజ్‌నాథ్ కూడా వెళ్లకపోవచ్చు..

**ఇంటర్నెట్‌డెస్క్:** రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొనకపోవచ్చని తెలుస్తోంది. రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను పంపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా విక్టరీ డే పేరుతో రష్యా ఏటా వేడుకలు జరుపుతుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో మే 9న భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. 80వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మిత్ర దేశాధినేతలను పుతిన్ ఆహ్వానించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మోదీకి ఆహ్వానం అందింది. అయితే భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మాస్కో పర్యటనకు మోదీ వెళ్లడం లేదు. ఆయన రావట్లేదని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ వెల్లడించింది. ఆ తర్వాత రాజ్‌నాథ్ వెళ్లారని వార్తలు వచ్చినా, ఇప్పుడు ఆయన పర్యటన కూడా రద్దయినట్లు తెలుస్తోంది. కాగా, ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.






## వ్యాక్సిన్ తీసుకున్నా.. ఏడేళ్ల చిన్నారికి రేబిస్ వ్యాధి

తిరువనంతపురం: కేరళలో ఏడేళ్ల బాలికకు రేబిస్ వ్యాధి సోకింది. ఆ అమ్మాయిని తిరువనంతపురంలోని శ్రీ అవిత్తమ్ తిరునల్ ఆస్పత్రిలోచేర్పించారు. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా ఆమెకు రేబిస్ సోకినట్లు గుర్తించారు. వ్యాక్సిన్ చివరి డోసు తీసుకోవడానికి ముందు వ్యాధి నిర్ధారణ జరిగింది. నెల రోజుల క్రితం ఆ అమ్మాయిని ఇంటి ముందు ఓ కుక్క కరిచింది. ఆ సమయంలో ఆమె పేరెంట్స్ వెంటనే హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. ఆ తర్వాత తాలూక ఆస్పత్రికి తీసుకుపోయారు. గాయాలన్నీశుభ్రం చేసి ఆ పాపకువ్యాక్సిన్ ఇచ్చారు. జ్వరం వస్తున్నట్లు ఆ అమ్మాయి ఓ వారం క్రితం ఫిర్యాదు చేసింది. అవిత్తమ్ తిరునల్ ఆస్పత్రికి ఆ చిన్నారిని తరలించారు. కొన్ని రోజుల క్రితం ఆరేళ్ల చిన్నారి కూడా రేబిస్ వ్యాధితో మలప్పురంలో చనిపోయింది. కుక్కలు దాడి చేసినప్పుడు ఒకవేళ వాటి దంతాలు రక్తనాళాలకు దిగితే అప్పుడు రేబిస్ ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా ఉంటుందని అవిత్తమ్ తిరునల్ ఆస్పత్రి డాక్టర్ బిందు తెలిపారు.

## పహల్గాం ఉగ్రదాడి.. చెన్నై నుంచి కొలంబో వెళ్లిన విమానంలో అనుమానితులు?




**కొలంబో:** పహల్గాంలో కాల్పులు జరిపిన ఉగ్రవాదులు కొలంబో చేరుకున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. కొలంబో ఎయిర్‌పోర్టులో భారీ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిం చారు. చెన్నై నుంచి కొలంబో వెళ్లిన విమానంలో ఎయిర్ పోర్ట్ సిబ్బంది, స్థానిక పోలీసులు తనిఖీలు చేపట్టారు. భారత్ నిఘా వర్గాల సమాచారంతో సోదాలు చేపట్టారు. శ్రీలంక ఎయిర్‌లైన్స్ చెందిన యూఎల్ 122 విమానంలో చేపట్టిన విస్తృత తనిఖీల్లో ఆరుగురు అనుమానితులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. పహల్గాం దాడితో సంబంధాలు న్నట్లు అనుమానం వ్యక్తమవుతున్నాయి. కాగా, పహల్గాం ఉగ్రదాడిపై ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇప్పటివరకు 3వేల మందికి పైగా ఎన్ఐఏ విచారించింది. ఇప్పటికే 90 మంది ఓవర్ గ్రౌండ్ వర్కర్లపై కేసులు నమోదుచేసింది. 100కుపైగా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. రేపు(ఆదివారం) కేంద్ర హోంశాఖకు నివేదిక ఇవ్వనుంది. ఈ కేసులో భాగంగా 2023లో రాజౌరీలో జరిగిన ఉగ్రదాడి కేసులో అరెస్టయిన ఇద్దరు వ్యక్తుల్ని ప్రశ్నించింది. ప్రస్తుతం జమ్ములోని కోట్ భల్వాల్ జైల్లో ఉన్న లష్కరే తోయిబా ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ నిస్సార్ అహ్మద్, ముస్తాక్ హుస్సేన్‌ను విచారించింది. పహల్గాం ఉగ్రదాడిలో వీరికి సంబంధాలు ఉన్నాయా? అనే అనుమానంతోనే వారిని ఎన్ఐఏ అధికారులు విచారించినట్లు సమాచారం. పహల్గాం దాడి ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తులోపలు సంచలన విషయాలు వెలుగులో వస్తున్నాయి. ఈ దాడి వెనుక పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రసంస్థ లష్కరే తోయిబా, పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొంది. లష్కరే తోయిబా ఉగ్రవాదులే ఈ దాడికి పాల్పడినట్లు తేల్చింది. ఈ దాడికి పాకిస్థాన్‌లోని లష్కరే ప్రధాన కార్యాలయంలోనే ప్లాన్ చేసినట్లు ఎన్ఐఏ వెల్లడించింది.

## బీ కేర్‌ఫుల్..



దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరిగా అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్ విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు రాజస్థాన్ మొదలు పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, ఒడిశా, బీహార్ మీదుగా గంగాపరివాహక పశ్చిమబెంగాల్ వరకు పిడుగుల వాన పడే ప్రమాదం ఉందని ఐఎండీ పేర్కొంది. పైన పేర్కొన్న అన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కూడా పడే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా అసోం, కర్ణాటక, ఉత్తరాఖండ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో జల్లులు కురుస్తాయని వెల్లడించింది. ఆయా ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది.

## ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. కర్రీ, సాంబార్ సరిగా చేయలేదని..



తినే తిండికోసం ఓ వ్యక్తి ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను చంపేశాడు. అది కూడా కర్రీ, సాంబార్ సరిగా లేదని ఆమెను పొట్టన పెట్టుకున్నాడు. ఈ సంఘటన కర్ణాటకలోని బాగల్కోట్ జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిసిన వివరాల మేరకు.. కర్ణాటక, బాగల్కోట్ జిల్లా, ముగలఖోడకు చెందిన బీరప్ప పూజారీ కొన్నేళ్ళ క్రితం బెల్గాం జిల్లా, వాడగోల గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉండి చదువుకుంటూ ఉండేవాడు. అక్కడ అతడికి శక్తిత అనే యువతితో పరిచయం అయింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమ సంగతి ఇంట్లో వాళ్లకు తెలిసింది. ఒకే కులానికి చెందిన వారు కావటంతో వీరి పెళ్లికి ఇరు కుటుంబాల వారు ఒప్పుకున్నారు. గత సంవత్సరం వీరి పెళ్లి ఘనంగా జరిగింది. అప్పటినుంచి వీరిద్దరూ ముగలఖోదలోనే ఉంటున్నారు. పెళ్లయిన కొన్ని నెలల పాటు ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. తర్వాతి నుంచి ఇద్దరి మధ్యా చిన్న చిన్న గొడవలు అవుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 29వ తేదీన కర్రీ, సాంబార్ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. కర్రీ, సాంబార్ సరిగా లేదని బీరప్ప భార్యను తిట్టాడు. దీంతో గొడవ మొదలైంది. ఆ గొడవ కొద్ది సేపటికే తారాస్థాయికి చేరింది. భార్య మాటకు మాట సమాధానం చెప్పటంతో బీరప్ప తట్టుకోలేకపోయాడు. ఆమెను కిందపడేసి గుండెలపై కూర్చొన్నాడు. తర్వాత గొంతు నులిమి చంపేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శక్తిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మర్డర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారిస్తున్నారు. అయితే, కర్రీ, సాంబార్ కోసం ఈ హత్య జరగలేదని పోలీసులు భావిస్తున్నారు. బీరప్పకు వేరే మహిళలతో సంబంధం ఉన్నట్లు సమాచారం అందింది. ఈ కారణంతో ఇద్దరికీ గొడవ అయినట్లు తెలుస్తోంది. అన్ని కోణాల్లోంచి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శరవేగంగా బుల్లెట్ రైలు స్టేషన్ పనులు



**ముంబై :** ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బికెసి) వద్ద బుల్లెట్ రైలు స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. శనివారం బికెసి వద్ద నిర్మాణంలో ఉన్న భూగర్భ స్టేషన్‌ను వైష్ణవ్ సందర్శించి, క్షేత్రస్థాయి పనుల పురోగతిని సమీక్షించారు. 500 కి.మీ.లకు పైగా పొడవైన ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అమలు చేస్తున్న నేషనల్ హై-స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సిఎల్) అధికారులు, సెంట్రల్ రైల్వే అలాగే వెస్ట్రన్ రైల్వే ప్రతినిధులతో కలిసి పనుల పురోగతిని వైష్ణవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బికెసిలోని బుల్లెట్ రైలు ప్రారంభ స్టేషన్‌లో పనులు చాలా వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. బి3 బేస్‌మెంట్ స్థాయి, స్టేషన్ గోడల బలోపేతం పూర్తయిందని చెప్పారు. అదే సమయంలో సొరంగం పనులు చాలా వేగంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. సొరంగం భాగం దాటి, భూసేకరణ తర్వాత మహారాష్ట్ర విభాగంలో కొనసాగుతున్న అన్ని పనులు అధిక వేగంతో కొనసాగుతున్నట్లు తెలిపారు.

**బహుళ అంతస్తులుగా బీకేసీ స్టేషన్**

బీకేసీలో ప్రపంచ స్థాయి స్టేషన్‌ను బహుళ అంతస్తుల్లో నిర్మించడానికి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. కార్యాచరణ ప్రాంతాలు బి1 నుండి బి3 స్థాయిల్లో ఉంటాయని, బి3 రైలు పార్కింగ్ ప్రాంతంగా, బి2 కార్యాచరణ విధుల నిర్వహణ, గ్రౌండ్ లెవల్‌తో కూడిన బి1 ప్రయాణీకులకు సేవలు అందిస్తుందన్నారు. బికెసి బుల్లెట్ రైలు స్టేషన్‌లో తవ్వకం పనుల్లో దాదాపు 76 శాతం పూర్తయినట్లు ఎన్‌హెచ్ఎస్ఆర్‌సిఎల్ అధికారులు తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.08 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. వాటా ఒప్పందం ప్రకారం, భారత ప్రభుత్వం రూ.10 వేల కోట్లు, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలు ఒక్కొక్కటి రూ.5 వేల కోట్లు విరాళంగా ఇస్తాయి. మిగిలిన నిధులు జపాన్ నుండి 0.1 శాతం వడ్డీకి రుణం ద్వారా అందించబడుతుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గత వారం ఈ ప్రతిష్టాత్మక బుల్లెట్ రైలు ప్రాజెక్టు 2028 నాటికి పనిచేయడం ప్రారంభిస్తుందని చెప్పారు.

# అమరావతిపైనే బాబు కోటి ఆశలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలల రాజధానికి మరి కొద్ది క్షణాల్లో శంకుస్థాపన జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి వచ్చి మరీ పాల్గొంటున్నారు. ముందుగా సేకరించిన 33 వేల ఎకరాలకు తోడు మరో 44 వేల ఎకరాలను సేకరించి దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఇందుకోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు ఆయన సిద్ధపడుతు న్నారు. విమర్శలను సయితం పక్కన పెట్టి రాజధాని నిర్మాణం పూర్తయితే వచ్చేకిక్కు కోసం ఆయన వెయిట్ చేస్తున్నారు. తాను హైదరాబాద్ లో సైబరాబాద్ ను డెవలెప్ చేసినప్పుడు వచ్చిన ఇమేజ్ కు మించి అమరావతి నిర్మాణంతో రావాలని నాయుడుగారు భావిస్తున్నారు. అందు కోసం లక్షల కోట్ల రూపాయలను వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. తొలిదశలోనే దాదాపు నలభై మూడు వేల కోట్ల రూపాయల విలువైన పనులకు నేడు శంకుస్థాపన జరగుతుంది. ఇంకా రాజధాని ప్రాంతంలో నవనగరాల నిర్మాణంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తే చాలు ఇక తన జీవితం చరితార్థమవుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే వందలకోట్ల రూపాయలు వెచ్చించి ఇంత ఆర్భాటంగా చంద్రబాబు నాయుడుఅమరావతి రాజధాని పనులకు శంకుస్థాపన మళ్లీ చేయనున్నారు. దీనికి రీ లాంచింగ్ అని పేరు పెట్టినా అమరావతికి హైప్ తెచ్చేందుకే మరోసారి శంకుస్థాపనలు చేయిస్తున్నారన్నది వాస్తవం. . దాదాపు డెబ్బయి ఏడు ఎకరాలు ఒక్క రాజధానిలో ఉండటంతో పాటు విజయవాడ, గుంటూరు నగరాలను కలిపితే ఇక ఏపీకి తిరుగుండదని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అప్పుడు పెట్టుబడుల కోసం తాము కాళ్లరిగేలా తిరగాల్సిన పనిలేదని, వాటంతట అవే వచ్చిపడతాయన్న నమ్మకంతో ఏపీ సీఎం ఉన్నారు. మరోవైపు వీలయినంత త్వరగా కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా



ఏర్పాటు చేసే విధంగా సహకరించాలంటూ నేడు మోదీని చంద్రబాబు నాయుడు కోరనున్నారు. ఇప్పటకే కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం భూములను కేటాయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర నుంచి అనేక ప్రముఖ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరనున్నారు. దీంతో పాటు రైతులు ప్లాట్లుగా ఇచ్చిన భూమి పోగా ప్రభుత్వానికి భారీగా వేలాది ఎకరాలు మిగలనున్నాయి. ఈ మిగిలిపోయిన ఎకరాలను వేలం వేసినా రాజధాని నిర్మాణం కోసం చేసిన ఖర్చు వెనక్కు తిరిగి వస్తుందని చంద్రబాబు అంచనా. అందుకే తెగించి ఆయన ఈ నిర్ణయం తీసుకునట్లే కనపడుతుంది. వేగంగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసిన తర్వాత తనకు ఇంకేమీ ఆశ మిగలదని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అంటే ఆయన అమరావతి నిర్మాణాన్ని ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో అర్థమవుతుంది. రాజధాని అమరావతి పూర్తయి న తర్వాత తనను తెగిడిన వాళ్లు కూడా ఖచ్చితంగా పొగుడ్తారని ముందుకు చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. మరి ఏం జరుగుతుందన్నది తెలియాలంటే మరో మూడేళ్ల కాలం వెయిట్ చేయాల్సిందే.

# అధ్యాత్మికత కంటే ఆదాయంపైనే అధికారులు దృష్టి

**విజయవాడ :** ఏపీ దేవాదాయ శాఖను దేవుడే రక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. భక్తి విశ్వాసాలను కాపాడాల్సిన దేవాదాయ ధర్మాదాయ శాఖలో అధ్యాత్మికత కంటే ఆదాయంపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సాగాల్సిన పాలనను ఇంఛార్జిలకు అప్పగించడం వెనుక మతలబు ఏమిటో తెలియాల్సి ఉంది.ఏపీ దేవాలయాల్లో వరుస ప్రమాదాల్లో భక్తులు ప్రాణాలు కోల్పవడానికి దేవాదాయ శాఖకు సరైన సారథి లేకపోవడమేననే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఇంఛార్జిలతో దేవాదాయ శాఖను నడిపించడమే సమస్యకు మూల కారణంగా కనిపిస్తోంది.దేవుడి దర్శనాలకు వచ్చిన భక్తులు ప్రమాదాల్లో మరణిస్తున్న ఏపీ దేవాదాయ శాఖలో మాత్రం చలనం రావడం లేదు. ప్రమాదాలపై విచారణ కమిటీలు వేసి చేతులు దులుపుకోవడం మినహా దేవాదాయ శాఖను ప్రక్షాళన చేసే ప్రయత్నాలు మాత్రం జరగడం లేదు.సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో భక్తులు చనిపోవడం అందరిని కలిచి వేసింది. రాష్ట్రంలోని ఏ గ్రేడ్ దేవాలయాల్లో ఒకటైన సింహాచలం దేవస్థానానికి ఇప్పటి వరకు పూర్తి స?థాయి ఈవో లేరు. సింహాచలం దేవస్థానానికే కాదు ఏపీ దేవాదాయ శాఖకు కూడా పూర్తి స్థాయి కమిషనర్ లేరు.రాష్ట్రంలో అత్యంత కీలకమైన దేవస్థానాల్లో సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఒకటి. ప్రస్తుతం దేవాదాయ శాఖ కమిషనర్‌గా ఉన్న రామచంద్రమోహన్ కూడా గతంలో అక్కడ ఈవోగా పనిచేశారు. విజయవాడ ఇంద్రకీలాద్రి, శ్రీకాళహస్తి, అన్నవరం, శ్రీశైలం, కాణిపాకం, సింహాచలం వంటి ఆలయాలకు దేవాదాయ శాఖలో సీనియర్లుగా ఉన్న అధికారులను ఈవోలుగా నియమిస్తారు.స్వతంత్ర సంస్థగా ఉన్న టీటీడీకి మాత్రమే ప్రస్తుతం ఐఏఎస్ అధికారి ఈవోగా ఉన్నారు. ఏడు ప్రధాన ఆలయాల్లో ద్వారకాతిరుమల, కనకదుర్గమ్మ ఆలయాలకు తప్ప సింహాచలం, అన్నవరం, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలకు రెవెన్యూ అధికారులే ఈవోలుగా ఉన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ఆలయాలను దేవాదాయ శాఖ అధికారులు ఆదాయ వనరులుగా మార్చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి.దేవాదాయ శాఖ కమిషనర్‌లుగా ఐఏఎస్ అధికారుల్ని నియమిస్తే అక్రమాలు సాగవనే ఉద్దేశంతోనే వారిని నియమించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.సింహాచలంలో వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరవుతారని తొలుత జీవో విడుదల చేశారు. ప్రధాని పర్యటన, అమరావతి రాజధానిలో కార్యక్రమాల నేపథ్యంలో చివరి నిమిషంలో ముఖ్యమంత్రి సింహాచలం పర్యటన రద్దు అయ్యింది. ఆయన స్థానంలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న ఆనం సింహాచలం చందనోత్సవానికి హాజరు కాలేదుదేవాదాయ శాఖకు కమిషనర్ నియామకం విషయంలో కొందరు చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖకు మంత్రిగా ఆనం రాంనారాయణ రెడ్డి ఉన్నా, ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ మంత్రి ఓఎస్డీ దేవాదాయ శాఖలో ఇంచార్జి కమిషనర్ నియామకంలో చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఐఏఎస్ అధికారులతో సాగాల్సిన పాలనా వ్యవహారాలు ఇంచార్జితో సాగడం వెనుక బడా నేతల స్కెచ్ ఉందనే ఆరోపణలున్నాయి.దేవాదాయ శాఖ పరిధిలో కోట్లాది



రుపాయల ఆస్తులు, భూములు ఉంటాయి. వీటన్నింటి సంరక్షణ బాధ్యతలు కమిషనర్ చేతుల్లోనే ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భూములు వివాదాల్లో ఉన్నాయి. కోర్టు తీర్పులు ఉన్నా అన్యాక్రాంతమైన భూముల్ని స్వాధీనం చేసుకునే విషయంలో దేవాదాయ శాఖ చోద్యం చూస్తోంది.ప్రభుత్వానికి పెద్ద సంఖ్యలో దేవాదాయ భూముల అన్యాక్రాంతం అవుతున్న ఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను పర్యవేక్షించే అధికారులు వాటిని పరిష్కరించకుండా అడ్డ పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల్ని తమ చెప్పు చేతుల్లో ఉంచుకుని చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.దేవాదాయ శాఖలో ఇంచార్జిలకు బాధ్యతలు అప్పగించిన తర్వాత పలు వివాదాస్పద భూముల వ్యవహారాలు తెరపైకి వచ్చాయి. విజయవాడలో వందల కోట్ల ఖరీదు చేసే దుర్గగుడి ఆలయ భూములను కారుచౌకగా యాభై ఏళ్లకు లీజుకు ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అభ్యంతరం చెప్పడంతో ఆ ఫైల్ నిలిచిపోయింది. ఈ భూముల వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల ఒత్తిడి ఉందనే ఆరోపణలు ఉన్నాయి.విజయవాడ పటమటలో ఉన్న నల్లూరి వారి సత్రంకు చెందిన ఫంక్షన్ హాల్, వెంకటేశ్వర స్వామి ఆలయాలను స్వాధీనం చేసుకోవాలని ఏపీ హైకోర్టు 2022లో ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికీ అవి అమలు కాలేదు. ఈ వ్యవహారంలో అర్చకులు మంత్రి నారా లోకేష్ కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. దేవాదాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి ఎలాంటి వివాదం లేదని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ట్రస్టీలతో కుమ్మక్కై దేవాదాయ శాఖ అధికారులు ఈ నివేదిక ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అర్చకులు అధికారులకు ఫిర్యాదు చేశారు.విజయవాడ పటమటలో ఉన్న గోవిందరాజులు ఈనాం ట్రస్టుకు చెందిన భూముల్ని లీజు దారుడు జాతీయ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.100కోట్ల రుణం తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. దేవాదాయ శాఖకు దానపత్రం రాసిన భూముల్ని బ్యాంకులో తాకట్టు పెట్టిన వ్యవహారంపై దేవాదాయ శాఖ అధికారులు నోరు మెదకపడం లేదు. బ్యాంకు అధికారులు కూడా ఫిర్యాదు చేయకు పోవడం అనుమానాలకు తావిస్తోంది.లక్షల ఎకరాల భూములతో కోట్లాది రుపాయలు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నా వాటిని సంరక్షించడం కంటే అయినకాడికి సొమ్ము చేసుకుందామనుకునే ధోరణి దేవాదాయ శాఖ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.దేవాదాయశాఖలో కమిషనర్‌గా ఉన్న ఎస్.సత్యనారాయణను బదిలీ చేసిన తర్వాత ఐఏఎస్ అధికారిని ఆ పోస్టులో నియమించలేదు. అదనపు కమిషనర్-2గా ఉన్న రామచంద్ర మోహన్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో ప్రధాన దేవాలయమైన కనకదుర్గ ఆలయానికి కూడా ఆయనే ఇన్‌చార్జి ఈవోగా ఉన్నారు.దేవాదాయ శాఖలో 11 ఆర్జేసీ పోస్టులున్నాయి. డైరెక్టుగా డిప్యూటీ కమిషనర్ల నియామకం చేపట్టి, అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తే.. తర్వాత రెండేళ్లకు వాళ్లకు ఆర్జేసీగా పదోన్నతులు లభిస్తాయి. ప్రస్తుతం దేవాదాయ శాఖలో భ్రమరాంబ, సత్యనారాయణమూర్తి, త్రినాథ్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్ మాత్రమే రెగ్యులర్ ఆర్జేసీలు.రీజినల్ జాయింట్ కమిషనర్‌లలో భ్రమరాంబ, సత్యనారాయణమూర్తి ఈ ఏడాది, త్రినాథ్‌రావు, ఏడీసీ చంద్రకుమార్ వచ్చే జనవరిలో పదవీవిరమణ చేస్తారు. మిగిలిన ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ పై గతంలో ఏసీబీ దాడులు జరిగాయి.విశాఖపట్నంలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తెల్లవారుజామున క్యూలైన్ పై గోడ కూలి ఏడుగురు మృతి చెందడానికి గల కారణాలపై విచారణ జరిపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.దుర్ఘటన అనంతరం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.300 దర్శన మార్గం ప్రవేశ ద్వారం నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో బస్టాప్ సమీపంలోని కొండపై గోడ కూలింది.పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) ఆకే రవికృష్ణ, ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్) ఎం.వెంకటేశ్వర్రావు సభ్యులుగా ఉంటారు.ఈ ఉత్తర్వులు జారీ చేసిన 72 గంటల్లోగా కమిటీ తన ప్రాథమిక నివేదికను సమర్పించాలని, 30 రోజుల్లోగా పరిశోధనలు, సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వైఎస్ భారతి స్కూల్ గురించి తెలుసా

**కడప :** పులివెందుల ప్రాంతంలో వెంకటప్ప స్కూలు చాలా ఫేమస్. వెంకటప్ప.. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి గురువు. వెంకటప్పపై గౌరవంతో దీన్ని ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో.. వైఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ పాఠశాలను జగన్ 2007-08 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు.ఈ పాఠశాల పులివెందులలోని భాకరాపురం వైఎస్ జగన్ ఎస్టేట్‌లో 15 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అత్యాధునిక వసతులతో దీన్ని నిర్మించారు. వైఎస్ భారతి ఈ పాఠశాల కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలో అర్హులైన పేద విద్యార్థులందరికీ ఉచితంగా విద్య, దుస్తులు, పుస్తకాలు, ఇతర ఫీజులను వైఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా అందిస్తారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. దీనికి భారీ స్థాయిలో స్పందన వచ్చింది.ఈ పాఠశాలను వైఎస్ రాజశేఖర రెడ్డి గురువు వెంకటప్ప జ్ఞాపకార్థంగా స్థాపించారు.పేద, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో దీనిని ఏర్పాటు చేశారు.ఈ పాఠశాల 2007-08 విద్యా సంవత్సరం నుండి కార్యకలాపాలు ప్రారంభించింది.వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోంది.

## ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు

-మొదటిపేజీ తరువాయి

విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడేందుకు అవకాశం ఉందన్నారు. ఇవాళ తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.8 డిగ్రీలు, ప్రకాశం జిల్లా బోట్లగూడూరులో 41.5 డిగ్రీలు, పల్నాడు జిల్లా క్రోసూరులో 41 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించారు.

## ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతి

-మొదటిపేజీ తరువాయి

మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పేరుపేరునా సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. కాగా.. అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న(శుక్రవారం) పర్యటించారు. ప్రధానిమోదీ పర్యాటన ఆసక్తికరంగా సాగింది. అమరావతి సభ వేదిక నుంచి ఏపీలో రూ. 58 వేల కోట్ల పనులకు మోదీ శ్రీకారం చుట్టారు. ఏపీలో పలు ప్రాజెక్ట్‌లకు శకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అమరావతి సభకు ఏపీలోని వివిధ జిల్లాల నుంచి రైతులు, ప్రజలు భారీగా తరలి వచ్చారు. అమరావతి సభ కోసం ఏపీ ప్రభుత్వం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లాల నుంచి ప్రజలను తీసుకురావడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## రేషన్‌కార్డుదారులకు నో చింత

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు కసరత్తు చేపట్టిన సర్కార్.. కార్డుల జారీకి ముందు రేషన్‌కార్డుకు ఈ కేవైసీ ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందుకోసం ఓ గడువును కూడా విధించింది. ఏప్రిల్ 30 వరకు రేషన్ కార్డు ఈ కేవైసీ చేసుకునేందుకు గడువు విధించింది సర్కార్. అయితే ఏప్రిల్ 30 తేదీ దాటినప్పటికీ కొందరు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదు. పలు కారణాలతో ప్రజలు ఈ కేవైసీని పూర్తి చేయలేకపోయారు. ఈ క్రమంలో ఇలాంటి వారికి కోసం ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ కేవైసీనీ చేసుకునేందుకు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ గడువును జూన్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు చేసింది. ఆ గడువు లోపు ఈకేవైసీని పూర్తి చేయాలని స్పష్టం చేసింది. కాగా.. బోగస్ కార్డులను ఏరివేయడంతో పాటు రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ కేవైసీ ప్రక్రియను తీసుకువచ్చింది ప్రభుత్వం. అందులో భాగంగానే జనవరిలోనే ఈకేవైసీపీ ప్రక్రియను ప్రారంభించింది. ఈకేవీసీ పూర్తి చేసుకునేందుకు ఏప్రిల్ 30 వరకు గడువు విధిస్తూ.. ఆలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయని పక్షంలో రేషన్ సరుకులు నిలిపివేస్తామని అధికారులు ప్రకటనలు ఇచ్చారు. రేషన్‌కార్డులు ఉన్న వారు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఈ కేవైసీని చేసుకునే విధానాన్ని కూడా అమలులోకి తీసుకొచ్చారు. అయితే కొన్ని కారణాల వల్ల చాలా మంది ఈకేవైసీని పూర్తి చేయలేకపోయారు. అలాంటి వారి కోసమే మరో రెండు నెలల పాటు గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది ఏపీ ప్రభుత్వం

## ప్రతి ఇంటా వ్యాపారవేత్తలను తయారు చేయాలనేది సీఎం ఆలోచన

**విజయవాడ:** అమరావతి దేవతల రాజధాని అంటూ ప్రధాని మోదీ ప్రశంసించారని ఏపీ మంత్రి పార్థసారథి తెలిపారు. రాష్ట్రం నంబర్ 1గా ఎదుగుతుందనే నమ్మకాన్ని ప్రధాని కలిగించారన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. " సీఎం పనితీరు, దూరదృష్టిని ప్రధాని ప్రశంసించారు. రాష్ట్ర యువత కలలను అమరావతి నిజం చేస్తుందని ఆయన చెప్పారు. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, హెల్త్ రంగాల్లో అమరావతి అభివృద్ధి చెందాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో కేంద్రం పని చేస్తోందని చెప్పారు. గత పాలకులు అమరావతిలో విధ్వంసం సృష్టించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసుకోగలమనే నమ్మకం కలుగుతోంది. సీఎం నాయకత్వంలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు సాధ్యమే. ప్రతి ఇంటా వ్యాపారవేత్తలను తయారు చేయాలనేది సీఎం ఆలోచన. అందుకు అనుగుణంగా అందరం కలిసి పని చేస్తాం" అని పార్థసారథి తెలిపారు.

## చంద్రబాబూ.. రైతుల గోడు వినిపించడం లేదా?

-మొదటిపేజీ తరువాయి

పొగాకు ఇలా ఏ పంట చూసినా కనీస మద్దతు ధరలు రావడం లేదు. చొరవ చూపి, మార్కెట్లో జోక్యం చేసుకోవాలన్న కనీస బాధ్యతను విస్మరించారు. పైగా డ్రామాలతో ఆ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఇది న్యాయమేనా? మిర్చి విషయంలో కూడా మీరు రైతులను నమ్మించి మోసం చేశారు. మిర్చి కొనుగోలు అంశం కేంద్రం పరిధిలో లేకపోయినా, నాఫెడ్ కొనుగోలు చేస్తుందని మొదట నమ్మబలికారు. క్వింటాలు రూ.11,781కు కొంటామని చెప్పి, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా, ఒక్క రైతు నుంచి కాని, ఒక్క ఎకరాకు సంబంధించి కాని, ఒక్క క్వింటాల్ గాని కొనకుండా అన్నం పెట్టే రైతులకు సున్నం రాశారు. మా హయాంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3వేల కోట్లు పెట్టి, ఐదేళ్లలో రూ.7, 796 కోట్లు ఖర్చుచేశాం. చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని కనీస మద్దతు ధరల జాబితాలో లేని పొగాకు సహా అనేక పంటల రైతులను ఆదుకున్నాం. మీరు కొత్తగా ఏమీ చేయకపోయినా, కనీసం మా విధానాన్ని కొనసాగించి ఉంటే రైతులకు ఊరట లభించేది కదా? పైగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించడం దారుణం కాదా? ఇందులో కూడా కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు ఉన్నాయా?.

### రైతుల ఆందోళనపై వైఎస్ జగన్ ట్వీట్

ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతులు ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే, ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారు. జనాభాలో 60శాతం మంది ప్రజలు ఆధారపడే వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల అది తీవ్ర సంక్షోభానికి దారితీస్తే, లక్షల మంది ఉపాధికి గండిపడితే దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు? వెంటనే ప్రభుత్వం తరఫున మార్కెట్లో జోక్యం చేసుకోవాలని, కనీస ధరలు లభించని పంటల విషయంలో ప్రభుత్వమే జోక్యంచేసుకుని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## ఇక చకచకా అమరావతి పనులు

విజయవాడ : ఏపీ రాజధాని అమరావతి ప్రాధాన్యత, ప్రత్యేకత, నిర్మాణంపై సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన కీలక వ్యాఖ్యలివి. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలతో ఏపీకి ఒక భరోసా, రాజధాని కల సాకారమైందన్న ఒక నమ్మకం కలిగినట్లు అయింది. రాజదాని అమరావతి నిర్మాణాన్ని మనం చెయ్యాలి?మనమే చెయ్యాలని మోదీ నొక్కిమరీ చెప్పారు. అంటే ఏపీలో ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి.కేంద్రంలో బీజేపీ సర్కార్ ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి పూచికపుల్లంతా అడ్డుకూడా రాదనేది మోదీ మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి కావాల్సిన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. కావాల్సిందల్లా రాజధాని నిర్మాణం..అదీ కేంద్రం సహకారంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని మోదీ స్పష్టంగా చెప్పకనే చెప్పారన్నారు.వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏంటి అన్నట్లుగా?కేంద్రంలో మోదీ సర్కార్ ఉండడంతో ఇక రాజధాని అమరావతి నిర్మాణానికి ఎవరూ అడ్డుపడరని..ఏదీ అడ్డు రాదని?చక చకా రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మించుకోవాలని ఫుల్ పవర్స్ ఇచ్చేశారు ప్రధాని మోదీ. 2019 ఎన్నికల్లో జగన్ సీఎం కావడంతో అమరావతి నిర్మాణానికి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెరపైకి తేవడంతో అప్పటివరకున్న అమరావతి తెరమరుగైంది.

# సంపాదకీయం

## సర్వోత్తమం దానం

భారతీయ సనాతన సంస్కృతి సాంప్రదాయ ధర్మాలలో దానానికి చాలా గొప్పతనం ఉంది. తపస్సు, జపము, ఇతర అనుష్టానాలు చేయడం వల్ల వచ్చే ఫలితం ఒక్క ఈ దానం చేయడం వల్ల వస్తుందని పెద్దల ఉవాచ. అంతటి సత్కర్మల కన్నా దానము యొక్క విశిష్టతను మన శాస్త్రాలలో వర్ణించ బడింది. ఇంకా దానధర్మములే మోక్ష సాధనాలని ఉపనిషత్తులు ఉపదేశిస్తున్నాయి. ఉపనిషత్తుల ప్రకారము, దానము చేయుట వలన మనిషిలో ఉండే లోభత్వమనే దుర్గుణము నశించిపోతుంది. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో యజ్ఞం, ద్వాపరయుగంలో దానం, కలియుగంలో ధ్యానం యుగధర్మాలుగా పేర్కొన్నారు. అయితే దానం అన్ని కాలాల్లోనూ ఉత్తమమేననేది స్పష్టం. శిబి, బలి చక్రవతులు ఈ లోకంలో నిత్య స్మరణకు పాత్రులైనారు. కర్ణుడు అధర్మ పక్షపాతిగా ఉన్నా, తన శరీరంలో అంతర్భాంగా ఉన్న సహజ కవచ కుండలాలను ఇస్తే చావు తప్పదని తెలిసి, ఇంద్రుడు కోరిదే తడవుగా అర్పించిన కర్ణుడు దానకర్ణుడుగా ప్రసిద్ధుడైనాడు. శిబి చక్రవర్తి పావురం రూపంలో వచ్చిన వారు మానవమాత్రులు కాదని గ్రహించి, పరీక్షార్తుడు అయి, తన శరీరాన్ని కోసి దానం ఇచ్చిన ఉత్తముడు శిబి చక్రవర్తి. వచ్చింది మహా విష్ణువు అని తెలిసీ మూడడుగుల నేల దానం ఇవ్వడంవల్ల నాశనమవుతావని గురువు శుక్రాచార్యుడు చెప్పినా వినని సత్యసంధుడు బలిచక్రవర్తి దానగుణం సర్వకాలాలకూ ఆదర్శం. భూమికి పర్వతాలు, సముద్రాలు భారం కాదు. దానగుణం లేనివారే భారమవు తున్నారు అని పేర్కొన్నాడు శ్రీనాథుడు. దానమనేవి అవి నిత్యకర్మ కావచ్చు, లేదా నైమిత్తిక దానమో, కామ్యక దానమో, విమల దానమో అయిన కర్మ కార్యాలు కావచ్చు. అంటే ఆకలి గొన్నవారికి ఆహారమును ఇవ్వడాన్ని అన్నదానము అంటారు. అలాకాకుండా ప్రతిరోజూ చేసే అన్నదానాన్ని నిత్యాన్న దానము అంటారు. ఈ నిత్యాన్న దానాన్ని అనేక దేవస్థానాలలోను, ధార్మిక సంస్థలలోనూ చూస్తూనే ఉంటాము. ఇలాంటి అన్నదానాలకు తమ వంతు సహాయాన్ని తప్పకుండా అందించాలి. అలాగే ఇలాంటి అన్నదానాలకు తయారు చేయించే పదార్థాలను తయారు చేయించేవారు, తయారు చేసేవారు కూడా ఆ పదార్థాలను భగవంతుడికి సమర్పించే పవిత్ర నైవేద్యాలు అనే పరమ పవిత్రమైన భక్తి భావనతో అంతే పవిత్రంగా తయారు చేస్తే పుణ్యం లభిస్తుంది. దానం అనే పవిత్ర కార్యాన్ని మొక్కుబడిగా చేయడం కూడా పాపమే. నైమిత్తిక దానమంటే ప్రత్యేక దినాలలో చేసే దానాలు. గ్రహణాలు, సంక్రమణాల వంటి రోజుల్లో చేసేవి. చాలా మంది తమ పుట్టినరోజు నాడో, పెళ్ళిరోజు నాడో, ఇతర ప్రత్యేకమైన దినాలలోనో చేస్తుంటారు. ఉగ్రరథ, భీమరథ శాంతులలో భాగంగా కూడా ఈ దానాలు చేస్తారు. ఎవరైనా మరణిస్తే, వారి కర్మలు అయ్యాక, పదవ రోజున దశ దానాలు చేస్తారు. ఇవన్నీ నైమిత్తికమైన దానాలు అనబడతాయి. కామ్యక దానాలంటే, ఏదైనా తమ కోరిక తీరడం కోసమో, లేక తనవారి, ఊరి వారందరి క్షేమం కోసమో చేసే పూజలు లేదా యజ్ఞ యాగాదులలో భాగముగా చేసే దానాలనే కామ్యక దానాలంటారు. అందులో బంగారము, వెండి గోవులను దానంగా ఇస్తారు. నాలుగోది, యతులు, గురువులకు, సన్యాసులకు ఇచ్చే దానములు విమల దానములు. దాతకు యే కోరికా, అవసరమూ ఉండవచ్చు, ఉండక పోనూవచ్చు. వీటిని భయంతో కాకుండా కేవలము భక్తితోనో, దైవ చింతతోనో చెయ్యాలి. ఈ దానాలు అన్నీ కూడా, మూడో కంటికి తెలియకుండా, తమ గొప్పకోసమో, ఇతరుల మెప్పు కోసమో కాకుండా చేసినపుడే, ఫలితాలు సఫలవంతము అవుతాయి. ఈ మధ్య మనం ఎక్కువగా చూస్తున్నవి రెండు రకాలు... ప్రతిష్టాత్మక దానాలు, ప్రేరక దానాలు. ఎదుటి వారు ఎంత ఇచ్చారు అని తెలుసుకొని, తన పేరు ప్రఖ్యాతులు, ప్రతిష్టలు పెంచు కోవడం, తద్వారా ప్రచారం కోసం వారు ఇచ్చిన దానికంటే తాను ఎక్కువ దానం చేయడాన్నే ప్రతిష్టాత్మక దానాలు అంటారు. నేను దానం చేస్తున్నాను, నేను చేసే ఈ దానాన్ని పదిమందికి తెలిసే విధంగా బోర్డులు పెట్టించండి. ప్రచారం చేయండి. అది చూసి ఇతరులు కూడా దానం చేస్తారు అని అంటూ దానం చేసేవారి దానాన్ని ప్రేరక దానాలు అంటారు. నిజానికి దాన ధర్మాలు ఆచరించడానికి పూర్వం కొన్ని నియమాలు, కట్టుబాట్లూ ఏర్పరచారు. దానము చేసే దాత, తనకు ఏ విధమైన నివారింపలేని రోగాలు లేనప్పుడు, పాప సంచితుడు కానపుడు, పాతకాలు చుట్టుకొని లేనపుడు, తాను అనేక పుణ్యాలు చేసి, సద్గుణ సంపన్నుడై ఉన్నపుడు, ధనాన్ని నీతి, న్యాయ, ధర్మ మార్గములలో సంపాదించి నప్పుడు మాత్రమే దానము చేయుటకు అర్హుడు. దానము మీద శ్రద్ధ, భక్తి కలిగి ఉండటము, దానమనేది పుణ్య కార్యము అనే ఉద్దేశము కలిగి ఉండి దానం చేయుట ముఖ్యము. అంతే కాదు, గ్రహీత కూడా ఆ దానమును స్వీకరించుటకు అర్హుడై ఉండాలి. గ్రహీత చెడు అలవాట్లు, చెడు శీలము కలిగి ఉండరాదు. అయితే తాము ఇచ్చే వస్తువులు, పదార్థములు ఉపయోగ యోగ్యములుగా ఉండాలి. పాచిపోయిన, నిరుపయోగ వస్తువులు, పాడైపోయిన పదార్థాలు, పాలివ్వక వట్టిపోయిన ఆవులు, ఇతర లోహములను కలిపిన మిశ్రమ బంగారము వంటివి దానంగా ఇవ్వరాదు. తనకు చెందని వస్తువులు పదార్థములను ఎన్నటికీ దానము చేయరాదు, తాము స్వీకరించేవి అటువంటివే అని తెలిస్తే, తీసుకొనే వారు కూడా వాటిని తీసుకోరాదు. ఇవి రెండూ పాపమే. దాత, గ్రహీత కూడా, అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన ధనమును దానములో విసర్జించాలి. అట్టి వాటిని ఇవ్వరాదు, తీసుకొనరాదు. అలాచేస్తే జీవితంలో విపరీత పరిణామాలు కలుగుతాయి. ఒక గృహస్తు, తన శక్తికి మించిన దానాలు ఎన్నటికీ చేయరాదు. గురువులు పుణ్యము వస్తుందని చెప్పారు కదా అని అప్పులు చేసి దానములు ఇవ్వరాదు. తాను ఇచ్చే దానము వలన తన కుటుంబ సభ్యులు కష్టాలను, నష్టాలను అనుభవించరాదు. సాధారణంగా, గృహస్తులు తమ ఆదాయములో కనీసము పది శాతము వరకూ దానంగా ఇవ్వవచ్చు. అంటే కనీసము పదిశాతం మాత్రమే అనికాదు. తమ స్తోమతను బట్టి కూడా దానం చెయ్యవచ్చు. ఎదుటి వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని దానం చేయాలి. ఇతరుల నుండీ అరువు తెచ్చుకున్నవీ, ఇతరులు తమవద్ద రక్షణకోసము ఉంచినవీ దానాలు ఇవ్వరాదు. ఇక గ్రహీతలు కూడా, స్వధర్మానికి సంబంధించని వాటిని దానాలుగా స్వీకరించరాదు. దానం ఇస్తానని వాగ్దానం చేసి ఇవ్వక పోవడం, ఒకసారి దానము ఇచ్చిన తరువాత దాని గురించి ప్రశ్నించడం లేదా తిరిగి వెనుకకు తీసుకోవడం వల్ల పాపానికి లోనౌతారు. దానము ఇస్తానని మాట ఇచ్చిఉంటే, ఆమాట తిరిగి తీసుకోరాదు. తప్పకుండా దానము ఇచ్చే తీరవలెను. సాకులు చెప్పి తిప్పుకొని తిరగడం కూడా పాపమే. దానములు అన్నిటిలోకి గోదానము, సువర్ణ దానము, తులాపురుష దానములు గొప్పవిగా చెపుతారు. కానీ వాటికన్నా జ్ఞానదానము, విద్యాదానము, ధర్మమునకు సంబంధించిన విషయ దానము చేయండం అతిగొప్పవని శాస్త్రాలు చెబుతున్నాయి.

# మానవ హక్కులకు ట్రంప్ విఘాతం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన సుంకాల ఆంక్షలు ఒక వంక అంతర్జాతీయంగా అస్థిరమైన ఆర్థిక వ్యవస్థకు దారితీస్తుండగా, మరోవంక ఆయన సాగిస్తున్న హక్కుల వ్యతిరేక ప్రచారం మానవ హక్కులు తుడిచిపెట్టుకు పోయేందుకు దారితీస్తున్నట్లు, బిలియన్ల మంది ప్రజలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నట్లు మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ 'ట్రంప్ ప్రభావం' 2024 అంతటా ఇతర ప్రపంచ నాయకులు చేసిన నష్టాన్ని మరింత పెంచిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన వార్షిక నివేదిక 'ది స్టేట్ ఆఫ్ ది వరల్డ్ హ్యూమన్ రైట్స్'ను విడుదల చేస్తూ హెచ్చరించింది. అందరికీ సార్వత్రిక మానవ హక్కులను నిర్మించడానికి దశాబ్దాలుగా చేస్తున్న కృషిని హరించే విధంగా నిరంకుశ పద్ధతులు, కార్పొరేట్ దురాశల కలయికతో కూడిన క్రూరమైన కొత్త యుగంలోకి మానవాళి మునిగిపోవడాన్ని వేగవంతం చేసిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 150 దేశాలలో పరిస్థితిని అంచనా వేసింది. 'తన రెండవ పదవీకాలంలో వందరోజులు గడిచిన తర్వాత, అధ్యక్షుడు ట్రంప్ సార్వత్రిక మానవ హక్కుల పట్ల పూర్తి ధిక్కారాన్ని మాత్రమే ప్రదర్శించారు. మన ప్రపంచాన్ని సురక్షితమైన, న్యాయమైన ప్రపంచంగా మార్చడానికి రూపొందించిన కీలకమైన అమెరికా, అంతర్జాతీయ సంస్థలు, చొరవలను ఆయన ప్రభుత్వం వేగంగా, ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంది. బహుపాక్షికత, జాతి, లింగ న్యాయం, ప్రపంచ ఆరోగ్యం, ప్రాణాలను కాపాడే వాతావరణ చర్య అనే భావనలపై ఆయన చేసిన పూర్తి దాడి ఆ సూత్రాలు, సంస్థలు ఇప్పటికే ఎదుర్కొన్న గణనీయమైన నష్టాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది' అని ఆమ్నెస్టీ సెక్రటరీ జనరల్ ఆగ్నెస్ కల్లామర్డ్ తెలిపారు. 2024లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డాక్యుమెంట్ చేసిన భావప్రకటనా స్వేచ్ఛ, సంఘం- శాంతియుత సమావేశాలను లక్ష్యంగా చేసుకుని నిరంకుశ చట్టాలు, విధానాలు, ఆచరణల విస్తరణ మానవ హక్కులపై ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకతకు కేంద్రంగా ఉంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి, తమ అధికారాన్ని పెంచుకోవడానికి, మీడియా సంస్థలను నిషేధించడం ద్వారా, ఎన్‌జిఒలు, రాజకీయ పార్టీలను రద్దు చేయడం లేదా సస్పెండ్ చేయడం ద్వారా, 'ఉగ్రవాదం' అనే నిరాధారమైన ఆరోపణలపై విమర్శకులను జైలులో పెట్టడం ద్వారా, మానవ హక్కుల పరిరక్షకులు, వాతావరణ కార్యకర్తలు, గాజా సంఘీభావ నిరసనకారులు, ఇతర అసమ్మతివాదులను నేరస్థులుగా చేయడం ద్వారా భయాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తున్నాయి. అనేక దేశాలలో భద్రతా దళాలు పౌర అవిధేయతను అణిచివేసేందుకు సామూహిక ఏకపక్ష అరెస్టులు, బలవంతపు అదృశ్యాలు, తరచుగా ప్రాణాంతకమైన బలప్రయోగాన్ని ఉపయోగిస్తున్నాయి. బంగ్లాదేశ్ అధికారులు విద్యార్థుల నిరసనలపై 'కనిపించినప్పుడు కాల్పులు' ఆదేశాలు జారీ చేయడంతో దాదాపు 1,000 మంది మరణించారు. మొజాంబిక్‌లో భద్రతా దళాలు వివాదాస్పద ఎన్నికల తర్వాత సంవత్సరాలలో నిరసనలపై అత్యంత దారుణమైన అణచివేతను ప్రారంభించడంతో కనీసం 277 మంది మరణించారు. టర్కి నిరసనలపై పూర్తి నిషేధాలు విధించింది. శాంతియుత ప్రదర్శనకారులపై చట్టవిరుద్ధమైన, విచక్షణారహితమైన బలప్రయోగం కొనసాగిస్తోంది. అయితే, అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ కొన్ని మానవ హక్కులను నిలిపివేసి, యుద్ధ చట్టాన్ని ప్రకటించినప్పుడు దక్షిణ కొరియాలో ప్రజాశక్తి ప్రబలంగా ఎదురు తిరిగి ఆయనను పదవి నుండి తొలగించారు. భారీ ప్రజా నిరసనల తర్వాత ఆ చర్యలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఘర్షణలు పెరిగేకొద్దీ ప్రభుత్వ దళాలు, సాయుధ సమూహాలు ధైర్యంగా యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాయి. అంతర్జాతీయ మానవతా చట్టం, ఇతర తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడుతూ ఉండడంతో లక్షలాది మంది ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చేసిన మారణహోమాన్ని ఒక మైలురాయి నివేదికలో నమోదు చేసింది. వెస్ట్‌బ్యాంక్‌లో దాని వర్ణవివక్ష, చట్టవిరుద్ధమైన ఆక్రమణ వ్యవస్థ మరింత హింసాత్మకంగా మారింది. రష్యా 2024లో అంతకు ముందు సంవత్సరం కంటే ఎక్కువ మంది ఉక్రేనియన్ పౌరులను చంపింది. పౌర మౌలిక సదుపాయా లను లక్ష్యంగా చేసుకోవడం కొనసాగించింది. నిర్బంధించిన వారిని హింసకు, బలవంతపు అదృశ్యానికి గురిచేసింది. సూడాన్ ప్రభుత్వ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మహిళలు, బాలికలపై విస్తృతమైన లైంగిక హింసను ప్రయోగించాయి. ఇవి యుద్ధ నేరాలు, మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరాలకు సమానం. సూడాన్‌లో రెండు సంవత్సరాల అంతర్యుద్ధం కారణంగా మరెక్కడా లేని విధంగా అంతర్గతం గా స్థానభ్రంశం చెందిన వారి సంఖ్య 11 మిలియన్లకు పెరిగింది. అయినప్పటికీ, ఆ వివాదం దాదాపు మొత్తం ప్రపంచ ఉదాసీనతకు దారితీసింది. రోహింగ్యాలు మయన్మార్‌లో జాత్యహంకార దాడులను ఎదుర్కొంటూనే ఉన్నారు. దీనివల్ల చాలా మంది రాఖైన్ రాష్ట్రంలోని తమ ఇళ్లనుండి పారిపోయారు. ట్రంప్ పరిపాలన భారీ విదేశీ సహాయ కోతలు విధించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. పొరుగున ఉన్న థాయిలాండ్‌లోని శరణార్థి శిబిరాల్లోని ఆసుపత్రులను మూసివేయడం, పారిపోతున్న మానవ హక్కుల పరిరక్షకులను బహిష్కరణకు గురిచేయడం, సంఘర్షణ నుండి బయటపడటానికి ప్రజలకు సహాయపడే కార్యక్రమాలను ప్రమాదంలో పడేసేలా చేసింది. పారిస్ ఒప్పందాన్ని విరమించుకోవాలన్న అధ్యక్షుడు ట్రంప్ నిర్లక్ష్య నిర్ణయం, ఆయన 'డ్రిల్, బేబీ డ్రిల్' అనే పల్లవి ఈ వైఫల్యాలను మరింత పెంచాయి. 2024 రికార్డు స్థాయిలో అత్యంత వేడిగా ఉన్న సంవత్సరం. పారిశ్రామిక పూర్వ స్థాయిల కంటే 1.5 ఒసి దాటిన మొదటి సంవత్సరం. దక్షిణాసియా, యూరప్‌ను సర్వనాశనం చేసిన వరదలు, దక్షిణాఫ్రికాను ధ్వంసం చేసిన కరువులు, అమెజాన్ వర్షారణ్యాలను ధ్వంసం చేసిన మంటలు, అమెరికాలో విధ్వంసం సృష్టించిన తుఫానులు ప్రస్తుత స్థాయిలలో కూడా ప్రపంచ తాపన అపారమైన మానవ నష్టాన్ని బయటపెట్టాయి. ఈ శతాబ్దంలో 3ఒసి పెరుగుదల అంచనా వేయడంతో ఇటీవలి కాలిఫోర్నియా కార్చిచ్చులు ఇంటికి దారితీసినట్లుగా, పెరుగుతున్న తీవ్రమైన అసహజ విపత్తుల నుండి తాము రోగనిరోధక శక్తిని కలిగిలేమని ధనిక దేశాలు తెలుసుకోవాలి. ప్రభుత్వాలు కొత్త టెక్నాలజీలను తగినంతగా నియంత్రించడంలో విఫలమవడం, నిఘా సాధనాలను దుర్వినియోగం చేయడం, కృత్రిమ మేధస్సును ఉపయోగించడం ద్వారా వివక్ష, అసమానతలను పెంచడం ద్వారా ప్రస్తుత, భవిష్యత్తు తరాలకు మరింత హాని కలిగిస్తున్నాయి. టెక్ సంస్థలు చాలా కాలంగా వివక్ష, నిరంకుశ పద్ధతులను సులభతరం చేశాయి. పైగా, అధ్యక్షుడు ట్రంప్ ఈ ధోరణిని మరింత తీవ్రతరం చేశారు. సోషల్ మీడియా కంపెనీలు రక్షణలను వెనక్కి తీసుకోవాలని ప్రోత్సహించారు. మెటా మూడవ పార్టీ వాస్తవ తనిఖీని తొలగించడం సహా ద్వేషపూరిత, హింసాత్మక కంటెంట్ వ్యాప్తిని అనుమతించే వ్యాపార నమూనాను రెట్టింపు చేశారు. ట్రంప్ పరిపాలన, టెక్ బిలియనీర్ల మధ్య సమన్వయం ప్రబలమైన అవినీతి, తప్పుడు సమాచారం, శిక్షార్హత, కార్పొరేట్ అధికారాన్ని స్వాధీనం చేసుకునే యుగానికి తలుపులు తెరిచే ప్రమాదం ఉంది. తన ప్రమాణ స్వీకారోత్సవంలో టెక్ బిలియనీర్లను ప్రధాన స్థానంలో కూర్చోబెట్టడం నుండి ప్రపంచంలోని అత్యంత ధనవంతుడికి ప్రభుత్వ యంత్రాంగానికి అపూర్వమైన ప్రాప్యతను ఇవ్వడం వరకు, అధ్యక్షుడు ట్రంప్ తన స్వార్థపరులైన, కార్పొరేట్ మిత్రులను మానవ హక్కులు లేదా చట్టపాలన పట్ల కనీస గౌరవం లేకుండా ఉన్మాదంగా ప్రవహించేలా చేస్తారని తెలుస్తోంది అని ఆగ్నెస్ కల్లామార్డ్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ట్రంప్ పరిపాలన ఐసిసి ప్రాసిక్యూటర్‌పై విధించిన సిగ్గులేని ఆంక్షలతో శక్తివంతమైన దేశాల నుండి పెరుగుతున్న వ్యతిరేకత ఉన్నప్పటికీ, అంతర్జాతీయ న్యాయం, బహుపాక్షిక సంస్థలు అత్యున్నత స్థాయిలో జవాబుదారీతనం కోసం ఒత్తిడి చేస్తూనే ఉండటం హర్షింపదగిన పరిణామం. గ్లోబల్ సౌత్ ప్రభుత్వాలు అనేక ముఖ్యమైన కార్యక్రమాలకు నాయకత్వం వహించాయి. ఇజ్రాయెల్, గాజా, లిబియా, మయన్మార్, రష్యాలోని సీనియర్ ప్రభుత్వ అధికారులు, సాయుధ సమూహాల నాయకులపై ఐసిసి అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. కాబట్టి మన దారికి ఎవరు అడ్డు వచ్చినా, మనం తమ స్వార్ధ ప్రయోజనాలకోసం, విచ్చలవిడిగా ప్రజల మానవ హక్కులను హరించడానికి ప్రయత్నించే పాలనలను ప్రతిఘటించడం కొనసాగించాలి. ఈ గ్రహం మీద ఉన్న ప్రతి ఒక్కరి స్వాభావిక గౌరవం, మానవ హక్కులపై మన ఉమ్మడి నమ్మకంలో మన విస్తారమైన, అస్థిరమైన ఉద్యమం ఎప్పటికీ ఐక్యంగా ఉంటుందని ఆశిద్దాం.

# అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత ఏదీ?




అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ మూడవ వారంలో వారం రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ఆర్టీసీ బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, మార్టు, అపార్ట్మెంట్లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల, గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద డెమో నిర్వహిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించ వచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియచేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాలవుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్ట వచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, అయోమయానికి గురికాకుండ ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుపత్రులు, హొటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టైయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించటానికి మరో స్టైయిర్‌కేస్ సమకూర్చు కోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయో గించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం, వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్ని ప్రమాదం సంభించినపుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి. దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పు కోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# వివాహం దివ్యత్వ సాధనం పుస్తకావిష్కరణ



**మే 3,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు సభాభవనంలో పుదిపట్ల రామకృష్ణ సేవా సమాజ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ సంయుక్తంగా వివాహం దివ్యత్వ సాధనం అనే గ్రంధాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ శ్రీ రామ్ రఘునాథ్ విచ్చేసి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తితో కలిసి పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఈ పుస్తకం వివాహ దాంపత్య జీవితానికి సంబంధించి ఒక దిగ్దర్శినీ అని తెలియజేశారు. భారతీయ సభ్యత్వానికి ముఖ్యమైన కుటుంబ వ్యవస్థను వివరించారు. అనంతరం విశిష్ట అతిథులు మేడసాని మోహన్ ఈ గ్రంథం కోసం మాట్లాడుతూ భారతీయ కుటుంబ పరంపర, గృహస్థుని ధర్మాలు, గృహస్థాశ్రమం ద్వారా సాధించవలసిన విషయాలు, గృహస్థునికి ఉన్నటువంటి విలువలు, దాయిత్వాలు సమాజం ఏ విధంగా గృహస్థులపై ఆధారపడి ఉంటుంది మొ. విషయాలను వివరించడం జరిగినది. యావత్తు ప్రపంచం భారతీయ కుటుంబ వ్యవస్థను ఒక మార్గదర్శకంగా తీసుకుని విలువలతో కూడినటువంటి జీవన విధానాన్ని తెలియజేస్తుందని తెలియజేశారు. సభాధ్యక్షులు ప్రొ. జిఎస్సార్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సీతాదేవిని ఒక చక్కని ఉదాహరణకు చూపిస్తూ ఉత్తర రామ చరితంలో భౌభూతికవి వర్ణించడం భారతీయ కుటుంబ వ్యవస్థకు నిదర్శనంఅని తెలియజేశారు. ప్రతి ఒక్కరు గృహస్థ ధర్మం పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆముదాల మురళి, ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, డాక్టర్ సి వి రెడ్డి, సంపాదకత్వం వహించిన గంగవరం శ్రీదేవి, రామకృష్ణ సేవా సమాజం పుధిపట్ల నిర్వాహకులు సుధాకర్ రెడ్డి మరియు ప్రజలు విచ్చేసి కార్యక్రమం విజయవంతం చేసారు.

# క్రీడాకారుల జీవిత భద్రతకు కూటమి భరోసా






**35 ఏళ్ల క్రీడాకారుల కలను 35 రోజుల్లోనే నెరవేర్చాం**
**శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**

**మే 3,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, కానీ క్రీడల కారణంగా క్రీడాకారుడికి చేకూరే శారీరక, మానసిక స్థైర్యం అసాధారణమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన వార్షిక ఉచిత వేసవి శిక్షణ శిభిరంలో పాల్గొన్న 400 మంది క్రీడాకారులకు శనివారం ఆయన చేతులు మీదుగా క్రీడాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ గతంలో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు సైతం వారి భవిష్యత్తు పట్ల అభద్రతా భావం ఉండేదని, కానీ నేడు ఆ పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో లేదన్నారు. ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు క్రీడాకారులకు జీవిత భద్రతను కల్పిస్తూ ప్రభుత్వ కొలువుల్లో రాతపరీక్ష లేకుండా సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి ఇకపై ఏ నోటిఫికేషన్ విడుదలైనా రాత పరీక్ష లేకుండా క్రీడాకారులు సాధించిన మెడల్స్, వారి ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. 35 ఏళ్ల క్రితం పలువురు క్రీడాకారులు రాతపరీక్ష లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని దివంగత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి 35 ఏళ్ల క్రీడాకారుల కలను 35 రోజుల్లోనే సాకారం చేశామన్నారు. రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచే క్రీడాకారుడికి గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ కోటా కింద 3శాతం హారిజంటల్ రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. స్పోర్ట్స్ కోటా కింద 3శాతం హారిజాంటల్ రిజర్వేషన్ అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. దీని కారణంగా ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో రాష్ట్రవ్యాప్తంగా 421 మంది క్రీడాకారులకు ఉద్యోగ భద్రత లభిస్తుందని వివరించారు. దేశ గౌరవాన్ని, రాష్ట్ర గౌరవాన్ని పెంపొందించే క్రీడాకారులకు సముచితస్థానం కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని భావిస్తూ సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా క్రీడాకారులకు రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ క్రీడావసతులను కల్పించేందుకు క్రీడావసతులను కల్పించేందుకు క్రీడాప్రాధికార సంస్థ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారి కోసం క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే శాప్ కల్పిస్తున్న క్రీడాసదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు మరింత మెరుగ్గా రాణించి క్రీడల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల డీఎస్డీఓలు సయ్యద్ సాహెబ్, బాలాజీ, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, శాప్ కోచ్‌లు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

## కమిషనర్ గారికి సమ్మె నోటీసు ఇచ్చిన

# మున్సిపల్ యూనియన్ ప్రతినిధులు




**మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.**

**బద్వేల్ మే 3 (ప్రజా జ్యోతి న్యూస్)** శనివారం నాడు కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ -ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్ల సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు 2025 మే 20వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మె మరియు మున్సిపల్ రంగంలోని ఉద్యోగ- కార్మికుల సమస్యల పరిష్కారానికై మే 21,22 తేదీలలో సమ్మె నిర్వహించుటకై మున్సిపల్ కమిషనర్ వి.వి నరసింహారెడ్డి గారికి బద్వేలు మున్సిపల్ వర్కర్స్‌ఎ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాలువ నాగేంద్రబాబు మాట్లాడుతూ భారతదేశంలో స్వతంత్రం రాక పూర్వమే బ్రిటీష్ కాలం లోనే ప్రాణ త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం-1926, వర్క్ మెన్ కంపెన్సేషన్ యాక్ట్-1923, వేతనాల చెల్లింపు చట్టం-1935 తో సహా కనీస వేతనాల చట్టం-1948, బోనస్, గ్రాట్యూటీ, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చివేసిందని,ఈ లేబర్ కోడ్స్ వలన సంఘము పెట్టుకునే హక్కును, సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తున్నాయని,ఉద్యోగ విధానంలో ఫిక్స్ డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ విధానం ద్వారా ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులను బానిసలుగా మార్చివేస్తాయని,వేతనాల కోసం బేరసారాలాడే హక్కులను కార్మికులు కోల్పోతారని, ఇంతటి ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని,మన రాష్ట్రంలో ఆప్కాస్ సంస్థను రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, మునిసిపల్ పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ ,ఎన్.ఎం.ఆర్, డైలీ వేజ్, కోవిడ్, క్లాప్ డ్రైవర్లకు జీవో ఎంఎస్ నెంబర్ 36 తేదీ:-01-03-2024 ప్రకారం జీతాలు పెంచి చెల్లించాలని, వయో పరిమితిని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 62 సంవత్సరాల కు పెంచాలని, గత రాష్ట్రవ్యాప్త 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్ గ్రేషియా పెంపు, దహన సంస్కారాలకు 15 వేల నుండి 20వేలకు పెంపు, సంక్షేమ పథకాల అమలు, మున్సిపల్ స్కూల్ స్వీపర్స్ కు కనీస వేతనాల అమలు, పర్మినెంట్ ఉద్యోగులకు డిఏ, సరెండర్ లీవ్ ల బకాయిల చెల్లింపు, సిక్కు డెత్ మరియు రిటైర్మెంట్ పోస్టుల భర్తీలో కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మరియు తదితర డిమాండ్ల పరిష్కారానికై 2025 మే 20వ తేదీ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెతో పాటు మే 21,22 తేదీలలో మున్సిపల్ కార్మికులు సమ్మె పోరాటంలో పాల్గొంటున్నారని ఇప్పటికైనా కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంఘ నాయకుల్ని చర్చలకి ఆహ్వానించి సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో సమ్మె మూలంగా ప్రజానీకానికి ఎదురయ్యే ఇబ్బందులకు అసౌకర్యానికి కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, కార్యదర్శి బద్వేల్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి కాలువ శివకుమార్, కమిటీ సభ్యులు తేళ్ల కిరణ్, ఇండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్తి మార్గానికి హరినామ సంకీర్తన సోపానం..



**మే 3,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** మోక్షమార్గం పొందడానికి హరినామ స్మరణ లేక హరి సంకీర్తన సులువైన మార్గమని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి అన్నారు. కలియుగ వైకుంఠంగా పేరు పొందిన తిరుపతి నగరంలో అడుగడుగున ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతుంది. ముఖ్యంగా నగరవాసులు భజన మండలి గా ఏర్పడి ప్రతి శనివారం నగర సంకీర్తన చేయడం నగరానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకుని వస్తోంది. ఎప్పటిలాగే ఈ శనివారం కూడా భజన మండలి కళాకారులు సాంప్రదాయ వస్త్రధారణలతో నుదుటిపైన గోవింద నామలు తో మేళ తాళాలతో గోవింద నామ సంకీర్తనలు ఆలపిస్తూ భక్తి భావాన్ని తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరినామ సంకీర్తన లేక హరినామ స్మరణ మనిషిని దేవునికి దగ్గర చేస్తుందని మోక్షమార్గాన్ని ప్రసాదిస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్, వాసుదేవరెడ్డి, మునినాథ రెడ్డి, కొండే చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, విద్వాన్ కస్పా పద్మనాభం, మధు, కన్నప్ప గారి కేశవరెడ్డి, చంద్రబాబు నాయుడు, మేకల గంగయ్య, మల్లారపు వాసు, మురళి, విగ్రహాల కళ్యాణి, కళావతి, పార్వతి,జయమ్మ, సుభద్రమ్మ,అరుణ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## సంవిధాన్ అభియాన్ బచావోను జయప్రదం చేయండి - విజయ జ్యోతి



**బద్వేల్ మే 3 (ప్రజా జ్యోతి న్యూస్)** కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయ జ్యోతి శనివారం బద్వేలు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ తప్పుదారి పట్టిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 40 రోజులు జాతీయ రాష్ట్ర నియోజకవర్గ మండల స్థాయిలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంవిధాన్ అభియాన్ బచావో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ బద్వేలు నియోజకవర్గ మండల స్థాయి నాయకులకు విజయ జ్యోతి దిశా నిర్దేశం చేశారు. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలకు సంబంధించి వచ్చిన విజ్ఞప్తులను స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారిని కలిసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గోపవరం మండలంలోని రాచాయిపేట బ్రాహ్మణపల్లి సూర్య పల్లి గ్రామాలకు ప్రస్తుతం వారానికి రెండు రోజులు మాత్రమే బస్సు నడుస్తున్నదన్నారు. వీటిని ప్రతిదినము నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బద్వేల్ పట్టణ అధ్యక్షుడు పగడాల నరసింహ. డిసిసి జనరల్ సెక్రెటరీ వై అచ్యుతరాజు, పీసీసీ సభ్యులు డాక్టర్ అన్వర్, బద్వేల్ మండల అధ్యక్షుడు అంబవరం సుధాకర్ రెడ్డి,మధు సుధన్ రెడ్డి, షామీర్,గోపవరం మండల నాయకులు సాంబయ్య, అట్లూరు మండల నాయకులు గంగయ్య, బి. కోడూరు మండల నాయకులు గుర్రప్ప,బతల వెంకటేష్, షైక్ షాహుస్సేన్, సయ్యద్, నాయబ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


## ఉప్పర్ల పల్లెలో ఉపాధి హామీ పనులు కల్పించాలి ఇంతవరకు మొదలు కాని ఉపాధి హామీ పనులు. వ్యవసాయ కార్మిక సంఘం (అధ్యక్షులు) మండల అధ్యక్షులు జి శ్రీరాములు




**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండల పరిధిలోని ఉప్పర్ల పల్లె గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో జి, శ్రీరాములు, గ్రామ సచివాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గారికి 10,మంది గ్రామ కూలీలతో వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ప్రతి ఆర్థిక సంవత్సరములో నైపుణ్యము లేని వయోజనులందరికీ ప్రతి గ్రామీణ కుటుంబంలో పనిని కోరిన వారికి ఆ గ్రామీణ పరిధిలో 100 పని దినములు కనీస వేతనం వచ్చేలాగా చట్ట పరమైన హామీ ఇవ్వబడింది. అయినా కూడా ఇంతవరకు ఉపాధి హామీ పనులు ఉప్పర్లపల్లి గ్రామంలో మొదలు కాకపోవడతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి పని కల్పించాలని శ్రీరాములు డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో రంగన్న, భాస్కర్, ఆర్ రంగన్న, రమాదేవి, లాలూ నాయక్, ఆచారి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# డేటా సైన్స్‌కు మంచి భవిష్యత్తు యస్వీయూ ఉపకులపతి






**మే 3,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డేటా సైన్స్ చదివి ఉద్యోగాల ఇంటర్న్ షిప్ కు ఎంపికైన విద్యార్థులను యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు అభినందించారు. ఈ రోజు ఉదయం వి. సి. కార్యాలయంలో ఎన్ ఏ ఆర్ ఎల్, షార్, ఇస్రో వంటి సంస్థల్లో ప్లేస్‌మెంట్‌లను పొందిన విద్యార్థులను వారు అభినందించారు. ప్లేస్మెంట్ పొందిన వారి వివరాలు

1. ఎం. ప్రభాస్ రాజ్ – షార్
2. వి. భరత్ కుమార్ – వి ఎస్ సి సి
3. కె. వినయ్ – ఎన్ ఏ ఆర్ ఎల్
4. ఎం. దీప –ఎన్ ఏ ఆర్ ఎల్
5. ఎన్. నవ్య నిఖిత –ఎన్ ఏ ఆర్ ఎల్
6. జి. వి. సుమంత్ – ఎన్ ఏ ఆర్ ఎల్
7. టి. కీర్తి –ఎన్ ఏ ఆర్ ఎల్

విద్యార్థులను వారు ప్రశంసించారు. నైపుణ్యం సాధించడానికి ఇలాంటి కోర్సులను విశ్వవిద్యాలయం ప్రారంభించిందని అన్నారు. వారిని ప్రిన్సిపాల్ ఆచార్య పివి నరసయ్య, హెడ్ %�May% కోఆర్డినేటర్ అంజన్ బాబు, ఎక్సాఫ్లూయెన్స్ ఇంక్ యొక్క సహాయకులు ,టి ఎన్ శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కొన్ని కొత్త కోర్సులను ఆవిష్కరించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఎక్సాఫ్లూయెన్స్ ఇంక్., (యూఎస్ఏ )తో కలిసి పని చేసే నిపుణులతో విద్యార్థుల ప్రయోజనం కోసం డేటా సైన్స్‌లో కొత్త కోర్సులను విశ్వవిద్యాలయ అధికారులు ప్రకటించారు. 1.పీజీ డిప్లొమా ఇన్ డేటా సైన్స్ – (1 సంవత్సరం వ్యవధి),2. సర్టిఫికెట్ ఇన్ పైథాన్ ఫర్ ఏ. ఐ, ఎం.ఎల్ %�May% జెన్ ఏఐ – (6 నెలల వ్యవధి) 3.సర్టిఫికెట్ ఇన్ డేటా విజువలైజేషన్ – (6 నెలల వ్యవధి) 4.సర్టిఫికెట్ ఇన్ క్లౌడ్ టెక్నాలజీస్ –(6 నెలల వ్యవధి) వంటి కోర్సుల బ్రోచర్ ను వైస్ ఛాన్సలర్ , రిజిస్ట్రార్ విడుదల చేశారు.


# శృంగారపుకోటలో వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం.






**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** శృంగవరపుకోట నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాలలో శనివారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్సీ మరియు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు గారు లాంచనప్రాయంగా ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి క్రీడాకారిని ఎస్ కోట మండల వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి, నారాయణ కే బిట్ పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఏజీఎం. శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ వి.సత్య శేఖర్, స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష,కార్యదర్శులు అట్లూరి శ్రీ వెంకట్రావు మంథ సుబ్బారావు, ముంతాజ్ మాల్ వ్యవస్థాపకులు షేక్ ఖాదర్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు మల్లా రామ కృష్ణ, డాక్టర్ మల్లా వేణు, ఏ. స్వామినాయుడు పి.ఆర్.షటిల్ కోర్ట్ సభ్యులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉత్తేజానికి వికాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని, క్రీడలు చదువులకు ఎటువంటి ఆటంకం కాదని క్రీడల వలన పిల్లలు ఉత్తేజితులై మరింత చదువుల్లో రాణిస్తారని, ఇప్పుడు క్రీడల్లో రాణిస్తే అటు ఉన్నత చదువులకు ఉద్యోగాలకు 3% శాతం క్రీడాకోటా కూడా ప్రభుత్వం కల్పిస్తుందని. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి 2 లక్షల 20 వేల రూపాయలు ఖర్చవుతుందని దీనంతటికీ మా మిత్రులు అందరూ సహాయ సహకారం అందిస్తున్నారని వారందరికీ ధన్యవాదములు తెలియజేశారు. ఇదంతా ఒక ఎత్తు అయితే గత 19 సంవత్సరాల నుంచి నిరాటంకంగా దిగ్విజయంగా అలుపెరుగని శ్రామికుడిగా ఎస్ కోట పట్టణానికే తలమానికంగా క్రీడా ప్రపంచానికే ఒక జ్యోతిగా సేవలందిస్తు అనేకమంది రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను అందిస్తూ క్రీడా కర్మాగారాన్ని తమదైన శైలిలో క్రీడాకారులను తయారు చేస్తున్న డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాకు లభించిన ఒక వరమని సభికుల మధ్య క్రీడాకారుల చప్పట్ల మధ్య కొనియాడారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ ఇందులో రఘురాజు గారు చెప్పినట్లు నాదేమీ లేదని దీనంతటికీ కర్త,కర్మ, క్రియ అన్నీ రఘురాజు వారి మిత్రబృందం గత 19 సంవత్సరాలుగా నాకు అందిస్తున్న సహకారమే ఈ నిదర్శనమని, ఈ శిక్షణ శిబిరం మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుందని ఇప్పటికీ 70 మంది క్రీడాకారులు జాయిన్ అయ్యారని, ఇది 150 వరకు పెరిగే అవకాశం ఉందని, క్రీడాకారులందరికీ ఉదయం పౌష్టికాహారంగా పాలు గ్రుడ్డు, సాయంత్రం నిమ్మరసం గ్లూకోజ్, క్రీడా దుస్తులు అందిస్తామని, ప్రతి ఆదివారం క్రీడాకారులను విహారయాత్రకు తీసుకువెళతామని, చివర్లో క్రీడాకారుల మధ్య గ్రూపులుగా విభజించి వారి సామర్థ్యానికి సింగిల్సు,డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని, నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న కోచ్ మహమ్మద్ ఖలీలుల్లా, సీనియర్ క్రీడాకారులు సహకారం అందిస్తున్నారని తెలిపారు.

# థాంక్యూ సీఎం థాంక్యూ నారా లోకేష్ థాంక్యూ ఎమ్మెల్యే గుంతకల్ మండల క్రిస్టియన్ పాస్టర్స్.




**గుంతకల్లు మే 3 (ప్రజా జ్యోతి):** శనివారం పట్టణంలో రెండో వార్డ్ నందు ఉన్న చర్చిలో, యువగలం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం క్రిస్టియన్ సోదరులకు చర్చి ఫాదర్ లకు గౌరవ వేతనంగా నెలకు 5 వేల రూపాయల చొప్పున 7 నెలలు వారి ఖాతాలో జమ చేసినందుకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేసి గౌరవ ముఖ్యమంత్రి కి థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేస్తూ కృతజ్ఞతలు తెలిపిన గుంతకల్లు పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా గుంతకల్లు మండల టిడిపి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొని మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలో 35 చర్చులకు సంబంధించిన పాస్టర్లకు 35ఌ35000=1225000 రూపాయలు జమ చేయడం జరిగిందని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 4827 మంది పాస్టర్లకు 30 కోట్ల రూపాయ లు లబ్ధి పొందారని తెలియజేశారు.ఇంకా మిగిలిన పాస్టర్లకు జూన్ నెలలో అప్లై చేసుకునే అవకాశం ఉంటుంది అని సూచించారు.ప్రభుత్వం క్రైస్తవులకు అనేక రకాల ప్రభుత్వ పథకాలు అందిస్తుందని విదేశీ విద్య, క్రిస్టియన్ కార్పొరేషన్ లను సద్వినియోగం చేసుకోవాలని ఇచ్చిన మాట ప్రకారం గౌరవ వేతనం అందించిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కి మనమంతా రుణపడి ఉండాలని తెలియజేశారు. అనంతరం పాస్టర్లు గుమ్మనూరు నారాయణస్వామి కి, బి ఎస్ కృష్ణారెడ్డికి, డాక్టర్ పత్తి హిమబిందుకు శాలువాలు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బి ఎస్.కృష్ణారెడ్డి,క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈ టె స్వామిదాస్,2 వార్డ్ కౌన్సిలర్ మెహరిన్నిసా బేగం, వార్డ్ ఇంచార్జ్ మొక్కన్న గారి సాయి, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు,తలారి మస్తానప్ప, కౌన్సిలర్ ప్రభాకర్, చిప్పగిరి ప్రతాప్, నందీశ్వర్, పాస్టర్ ఓబులేష్, ఆనంద్ రెడ్డిమరియు కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ బంగాళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు..

### అమ్మవారిని దర్శించుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన..



**బాపట్ల, మే 3 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ బగళాముఖి అమ్మవారిని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం వద్ద ఎమ్మెల్యే కు పలువురు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. కాగా అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవ సందర్భంగా శనివారం శ్రీ బగళాముఖి అమ్మవారి ప్రాచీన బంగారు ఆభరణములను చందోలు స్టేట్ బ్యాంకు నుండి శోభా యాత్రగా తీసుకువచ్చారు. ప్రాచీన బంగారు ఆభరణములతో శ్రీ బగళాముఖి అమ్మ వారికి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అభివృద్ధివైపు పయనించాలని అమ్మవారిని కోరుకున్నట్లు వివరించారు. అదేవిధంగా బాపట్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా ముందుకు సాగాలని కోరుకున్నట్లు వెల్లడించారు.

## రాంపల్లిలో విషాదం...

### వరి గడ్డి వామి పడి బాలుడి మృతి....



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం పరిధిలోని రాంపల్లి గ్రామంలోని బోయ బుచ్చి సరస్వతి,బోయ బుచ్చి రామాంజినేయులు ఏకైక కుమారుడు బుచ్చి రమేష్ 13 సంవత్సరాల వయసు.బుచ్చి రమేష్ బాబు వారి పశువులకు మేత వేసేందుకు వరి గడ్డి వాము తవ్వుతూ ఉండగా అకస్మాత్తుగా వరి గడ్డి వాము రమేష్ మీద పడడంతో అక్కడే కుప్పకూలి పడి పోవడం వలన దాదాపు రెండు గంటల పాటు ఎవరు గమనించక పోవడంతో రమేష్ ఊపిరాడక అక్కడి కక్కడే చనిపోవడంతో రమేష్ తల్లి దండ్రులు సరస్వతి,రామాంజినేయులు వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

## ట్రాక్టర్ ప్రమాదంలో కడమకుంట్ల వ్యక్తి మృతి



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కడమగుంట్ల గ్రామంలో %ఖ%.సుధాకర్ వయస్సు 38 సంవత్సరాలు తండ్రి పేరు %ఖ%.హనుమంతు అను వ్యక్తి 01.05.2025 వ తేదీ సాయంత్రం పొలంలో ట్రాక్టర్ తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజిన్ రాయిపై ఎక్కి అదుపు తప్పడం వలన సుధాకర్ ట్రాక్టర్ నుండి కిందపడి తలకు రక్త గాయాలై కర్నూలు గౌరీ గోపాల్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ ఈరోజు చనిపోయినాడు అని సుధాకర్ భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడమైనది. చనిపోయిన సుధాకర్ కు ఇద్దరు కొడుకులు సంతానం.

## వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలి



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మే3 ప్రజాజ్యోతి న్యూస్** ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తాళ్లపూడి ఎస్సై టీ. రామకృష్ణ తెలిపారు తాళ్లపూడి మెయిన్ రోడ్డు బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహనదారులను తనిఖీ చేస్తున్న ఎస్సై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అలాగే త్రిబుల్ రైడ్ చేయకూడదని అన్నారు. అంతేకాకుండా గతంలో కంటే ప్రస్తుతం జరిమానాలు పెరిగాయని వాటిని అమలు పరుస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని విజ్ఞప్తి చేశారు.డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారుఅలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుంది అన్నారు ఈ తనిఖీలలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు

## అసత్య ప్రచారాలతో చంద్రగిరి అభివృద్ధిని ఆపలేరు

### మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఫేక్ రాజకీయాలు మానుకోవాలి

### తిరుపతి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి



**మే3,(ప్రజా జ్యోతి)తిరుపతి జిల్లా ప్రతినిధి** చంద్రగిరి నియోజకవర్గంలో గత పది నెలలుగా జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యే పులివర్తి నాని పై ఆరోపణలు చేస్తున్నారని తిరుపతి రూరల్ (మండల) తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ (మండల) రఘునాథ్ రీఛార్జ్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత పది నెలలుగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతించండి, అసత్య ఆరోపణలు మానుకోవాలని మాజీ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి తిరుపతి రూరల్ మండల తెలుగుదేశం నాయకులు హితువు పలికారు. మండలంలో అన్ని పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు,గుండోడు కణం రోడ్డు, నీళ్ల తొట్లు, ఆర్‌ఓ ప్లాంట్స్, గోకులం షెడ్లు తో పంచాయితీలలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతుంటే అనునిత్యం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఉపాధి హామీ పనులలో గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఎలాంటి అవినీతికి జరగకుండా అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్టియుసి కార్యనిర్వాహణ కార్యదర్శి అమ్మినేని మధు, చంద్రగిరి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు శ్రీధర్ నాయుడు,తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్ రెడ్డి, తిరుచానూరు టిడిపి కార్యదర్శి సాయి రాయల్, తెలుగు యువత హరే రామ్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో కసాపురం గ్రామంలో మే డే జెండా ఆవిష్కరణ



గుంతకల్లు మే 3 (ప్రజా జ్యోతి): శనివారం గుంటకల్లు డివిజన్ కసాపురం లో 139 వమే డే ను గుంతకల్లు డివిజన్ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు అధ్యక్షత న జెండా ఆవిష్కరించడం ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకంకండి కార్మికుల హక్కుల కొరకై నిరంతరం పోరాటం చేద్దామని పోరాటంలో అసువులు బాసిన అమరుల కు నివాళులర్పిస్తూ ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేద్దామని తెలిపారు. మే డే 1న కసాపురం కమిటీ జక్కన్న, కమిటీ సభ్యులు రంగమ్మ,మంగమ్మ,లక్ష్మీ, రామాంజనమ్మ,కళావతి తదితరులు పాల్గొన్నారు.

# పాలకొల్లు తరహాలో పోడూరులో మంచినీరు సరఫరా.

**సర్పంచ్ సువర్ణ రాజు ఆలోచన విధానం చాలా గొప్పది.**

**సువర్ణ రాజు తర్వాత సర్పంచులు కూడా ఈ మంచినీటి విధానాన్ని కొనసాగించాలి.**



**పోడూరు మే 3 ప్రజాజ్యోతి న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లులో అందించే మంచి నీరుకు జిల్లా వ్యాప్తంగా మంచి పేరు ఉంది. అలాంటి తరహాలోనే పోడూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ చెట్టు బత్తుల సువర్ణ రాజు ఆలోచన విధానంతో,పంచాయతీ తరపున ఎటువంటి కెమికల్స్ ఉపయోగించకుండా స్వచ్ఛమైన మినరల్ వాటర్ ని అందిస్తున్నారు. దీంతో నిత్యం ప్రజలు మంచినీరుని పట్టుకోవడంతో మంచినీరుని పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రదేశం మొత్తం ప్రజలతో రద్దీగా ఉంటుంది.కాగా ఈ మంచినీటి వ్యవస్థను పంచాయతీ వారు ఏర్పాటు చేసిన తర్వాత గ్రామంలోని ప్రజలందరూ ఈ మంచినీరికి అలవాటు పడి తమ దాహాన్ని తీర్చుకుంటూ ఎటువంటి అనారోగ్యం పాలు కాకుండా జీవిస్తున్నామని తెలపడం మంచి పరిణామం, గ్రామ ప్రజలు మాత్రమే కాకుండా ఈ నీరును చుట్టుపక్కల గ్రామాలు అయినటువంటి కవిటం, పండిత విల్లూరు, తూర్పుపాలెం తదితర గ్రామాలనుంచి కూడా రోజు ప్రజలు వచ్చి ఈ మంచినీరును పట్టుకెళ్ళి వారి దాహాన్ని తీర్చుకుంటున్నామని తెలుపుతూనే పోడూరు గ్రామంలో సర్పంచ్ సువర్ణ రాజు ఏర్పాటు చేసినట్టుగానే మా గ్రామాల్లోకుడా ఇలాంటి పద్ధతినే కొనసాగించి ప్రజలకు మంచినీరు అందించి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు. ఈ మంచి నీటిని ప్రజలు వినియోగిస్తుండడంతో సర్పంచ్ సువర్ణ రాజు ఆధ్వర్యంలో ప్రజలను ఎండ,వాన, బారి నుండి కాపాడడానికి ఒక షెడ్డును కూడా ఏర్పాటు చేయటం శుభ పరిణామం, అంతేకాకుండా ప్రజలు నీరుని పట్టుకునే సమయంలో ప్రజల కాళ్లకు బురద అంటుకోకుండా ఆ ప్రాంతమంతా సిమెంటు చేయించడం ఇంకా మంచి పద్ధతి, ఏది ఏమైనాప్పటికీ పాలకొల్లు తరహాలో పోడూరు గ్రామంలో కూడా మంచినీరును ప్రజలకు అందించి ఇంతటి మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తున్నటువంటి సర్పంచ్ సువర్ణ రాజు ఆలోచన విధానం అభినందించదగ్గది.

**సర్పంచ్ సువర్ణ రాజు మంచి పని చేశారు.**

పోడూరు గ్రామంలో ఎటువంటి కెమికల్స్ కలపకుండా పంచాయతీ తరపున ప్రజలకు నీరు అందిస్తు గ్రామ సర్పంచ్ చెట్టు బత్తుల సువర్ణ రాజు మంచి పని చేశారని తెలిపారు, అంతేకాకుండా ప్రజల సౌకర్యార్థం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ మంచి అందించడం చాలా గొప్ప విషయమని, ప్రజలకు మోకాళ్ళ నొప్పులు ఇతర రోగాలు రాకుండా ఈ నీరుని తాగిన తర్వాత తమ ఆరోగ్యాలు బాగుపడ్డాయని పోడూరు, అంబటి వాని చెరువు, చంద్రరాజు చెరువు, కొత్తపేట, గంగన్న చెరువు, పూజారి వారి గురువు, నంబూరు వాని గురువు కు చెందిన ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేసి సర్పంచ్ చెట్టుబత్తుల సువర్ణ రాజు వినూత్నమైన ఆలోచన విధానంతో ఏర్పాటు చేయబడిన ఈ మంచినీరు విధానాన్ని తర్వాత సర్పంచులు కూడా కొనసాగించి ప్రజలు దాహార్తిని తీర్చడంతోపాటు,వారు ఆరోగ్యాన్ని కూడా కాపాడాలని కోరుతున్నారు.

# లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడుదాం: ఐ ఎఫ్ టి యు



**గుంతకల్లు మే 3 (ప్రజాజ్యోతి):** శనివారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు ) ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఆటో స్టాండ్ లో , కసాపురం రోడ్ లోని ఆటో స్టాండ్ , భగత్ సింగ్ కాలనీ , రామిరెడ్డి కాలనీలో మేడే జెండాను ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ ఎగరవేయడం జరిగినది. మిగిలిన చోట్ల కూడా జెండాల ఆవిష్కరణ చేయడం జరిగినది.ఈ కార్యక్రమాలను ఉద్దేశించి ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్, ఓపిడిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు అడ్వకేట్ నాగరాజు మాట్లాడుతూ అమెరికాలో 139 సంవత్సరాల క్రితం చికాగో నగరంలో కార్మికులు సాగించిన పోరాటాల ఫలితంగా 8గంటల పని హక్కును,ఇతర సౌకర్యాలను సాధించుకున్నారు.అయితే మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ల పేరుతో ఉన్న హక్కులను రద్దుపరిచి కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారు లకు,బహుళ జాతి కంపెనీలకు అనుకూలమైన లేబర్ కోడ్ల ను తీసుకురావ డం జరుగుతున్నది.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణకు,లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కార్మిక వర్గం మేడే స్ఫూర్తితో ఉద్యమించాలి. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది.గత ప్రభుత్వంలోనూ ఇప్పటి ప్రభుత్వంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం రంగాల కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాల్సింది పోయి ఉన్న ఆప్కాస్ ఏజెన్సీని రద్దుచేసే కుట్ర ను రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నది. అసంఘటిత కార్మికులైన ఆటో మోటార్, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం కార్మిక వర్గం పోరాడాలి. కాశ్మీర్ లో ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం లో పూర్తి నిర్లక్ష్యం వహించిన కేంద్రం ఆపరేషన్ కగార్ పేరిట కర్రెగుట్ట అడవులలో వేలాది సైన్యాన్ని దింపి ఆదివాసుల కు అండగా ఉన్న మావోయి స్టులను బూటకపు ఎన్కౌంట ర్లతో మారణకాండను కేంద్ర ప్రభుత్వం కొనసాగించుచు న్నది.ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని మావోయిస్టు లతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ మాట్లాడడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి,రామాంజనేయులు,జిలాన్,ఐ ఎఫ్ టి యు నాయకులు రాందాస్, షేక్షావలి భాష,గోప,విశ్వనాథ్, నారాయణ కృష్ణ,రామంజి, రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి..

**జిల్లా కలెక్టర్ ఆదేశాలు..**

**జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులపై అధికారులతో చర్చ..**





**బాపట్ల, మే 3 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** వాడరేవు-నకిరేకళ్ళు, బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులపై రెవెన్యూ అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో ఆయన సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వాడరేవు-నకిరికల్లు జాతీయ రహదారి 167-ఏ నిర్మాణంలో కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చీరాల మండలాలలో భూ సేకరణ సమస్యలు పరిష్కరించాలన్నారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారందరికీ న్యాయబద్ధంగా నగదు చెల్లింపులు జరగాలన్నారు. చీరాల మండలంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో నివాసముంటున్న 63 గృహాల నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. చట్టబద్ధంగా వారికి రావలసిన పరిహారం అందించాలన్నారు. బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి 544- జి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. జె పంగులూరు మండలంలో ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తక్షణమే సమస్యను పరిష్కరించాలన్నారు. అద్దంకిలో ఆక్రమణలు తొలగించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కారణాల చేత నష్టపరిహారం నగదు చెల్లింపులు నిలిచిపోయిన వారికి తక్షణమే అందించాలన్నారు. రహదారుల నిర్మాణంలో జాప్యం ఉండకూడదని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అధికారులకు నిర్దేశం చేశారు. రెవిన్యూ సమస్యలన్నీ మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. 16వ నంబర్ జాతీయ రహదారి నిర్మాణాలో భాగంగా పిచ్చుకల గుడిపాడు వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం అర్థ హెక్టార్ భూసేకరణ త్వరగా చేపట్టాలన్నారు. సమీపంలో ఉన్న మరో భూమి సమస్య తక్షణమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎస్ డి సి లవన్న, బాపట్ల, చేరాల ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సంధ్యారాణి, సమీపంలోని మండల తహసిల్దార్లు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్ పుట్టినరోజు వేడుకలు




**గుంతకల్లు మే 3 (ప్రజాజ్యోతి):** కమలానగర్ నందు ఉన్న సొసైటీ కార్యాలయంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర రమేష్ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు మరియు సుంకర రమేష్ మిత్ర బృందం కేకును కట్ చేయడం జరిగినది.ఈ సందర్భంగా మొదటగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నందు రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అనేక మంది యువత స్వచ్ఛంద రక్తదానం చేయడం జరిగింది.అందులో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణ నందు ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర విశ్రాంతి తీసుకోనుటకు రెండు సిమెంట్ బెంచులను ఏర్పాటు చేయడం జరిగినది. తదనంతరం పాత ఊరు నందు కస్తూరిబా స్కూల్ ముందర పాదాచారులకు మజ్జిగ వితరణ చేయడం జరిగింది. సుభాష్ రోడ్ లోని అర్బన్ బ్యాంకు నందు చైర్మన్ జె ఎల్ మురళీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడం జరిగినది. అలాగే ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ టీం సభ్యులు సాయంత్రం నగరంలోని వివిధ సర్కిల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికు కూల్ డ్రింక్స్ ,మజ్జిగ బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువతలో చైతన్యం కలిగిస్తూ యువతను సామాజిక సేవ వైపు నడిచే విధంగా ఈ సమాజంలో ఉంటే దేశం ప్రగతి పథంలో ఉంటుందని అలాగే నా పుట్టినరోజు సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడానికి తోడ్పడిన ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులకు, మిత్ర బృందానికి మరియు అర్బన్ బ్యాంక్ చైర్మన్ జె ఎల్ మురళీధర్ గారికి శ్రేయోభిలాషులకు పేరుపేరునా నమస్కారాలు తెలుపుకుంటున్నానని. భవిష్యత్తులో మా సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు ఇలాగే నిర్వహిస్తామని తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం తండ్యాం గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తాడివలస పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందజేశారు. ముందుగా పొందూరు మండల కేంద్రంలో నాయుడు వీధిలో ఉన్న హెల్త్ వెల్నెస్ సెంటర్ ను సందర్శించి ,వైద్య శిబిరంలో పాల్గొన్నారు. తండ్యాం గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి వైద్యులు పలు సూచనలు అందజేసి అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణ, పారా మెడికల్ స్టాఫ్ ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కలల సౌధం కళ్ల ముందు వాలింది

**ఆశల రాజధాని అంగరంగ వైభవంగా ఆవిష్కృతమైంది**

**వేడుకలా రాజధాని పునః ప్రారంభోత్సవం**

**తండోపతండాలుగా తరలివచ్చి అమరావతికి జేజేలు పలికిన ప్రజానీకానికి పాదాభివందనాలు**

**ఏపీ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**




**నందిగామ, మే 03 - ప్రజాజ్యోతి** అమరావతి 2.0కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన వేడుకకు రాష్ట్రవ్యాప్తంగా జైత్రయాత్ర కదిలిందని, రూ.49,040 కోట్లతో కూడిన ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన, కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవంతో రాజధాని అంతటా పండుగ వాతావరణం కనిపించిందని ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. శనివారం కాకాని నగర్ కార్యాలయం వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. వెలగపూడి వేదికగా రాజధానిలో రూ.49 వేల కోట్ల పనులకు,నిర్మాణాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు ప్రధాన వేదికపై ఆశీనులు కాగా, ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగిందనీ పేర్కొన్నారు . రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారన్నారు. సభ జరిగే వెలగపూడితో పాటు అన్ని గ్రామాల్లోనూ ఇదే వాతావరణం కనిపించిందనీ ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని విజయవంతం చేసిన ప్రజానీకానికి అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతి కోసం భూ సమీకరణలో భూములిచ్చిన రైతులు మురిసిపోయారు. ఐదేళ్లు అష్టకష్టాలు పడ్డారని, తిరిగి అమరావతికి ప్రాణం పోస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారని తంగిరాల సౌమ్య గుర్తు చేశారు.

## ఘనంగా గుంతకల్లు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో అంతర్జాతీయ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ వేడుకలు




**గుంతకల్లు మే 3 (ప్రజా జ్యోతి) :** గుంతకల్లు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ కార్యక్రమం నిర్వహించాము.. ఈ కార్యక్రమాన్ని ఏపీయూడబ్ల్యూజే నియోజవర్గం అధ్యక్షులు జి.మొహమ్మద్ రఫీక్ అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గుంతకల్లు వన్ టౌన్ సిఐ బోయ.మనోహర్, గుంతకల్లు టూ టౌన్ సిఐ మస్తాన్,ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపకులు మంజుల వెంకటేష్,సీనియర్ న్యాయవాది నాగరాజు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తులు మాట్లాడుతూ... అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం 1991 లో నామిబియాలోని విండ్హోక్ పట్టణంలో నిర్వహించిన యునెస్కో సదస్సులో విండ్హోక్ డిక్లరేషన్ అనే ప్రకటన వెలువడింది.ఈ ప్రకటనలో స్వతంత్ర స్వేచ్ఛాయుత,బహుళ వేదికల మీడియా అవసరాన్ని పేర్కొన్నారు.ఈ డిక్లరేషన్ ను బేస్ చేసుకుని 1993 లో ఐక్యరాజసమితి ప్రధాన అసెంబ్లీ మే 03 ను ప్రపంచ ప్రెస్ స్వేచ్ఛా దినోత్సవంగా ప్రకటించిందని తెలియజేశా రు.ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఏపీయూడబ్ల్యూజే ప్రింట్ మీడియా అధ్యక్షులు శేషగిరి,పట్టణ ప్రధాన కార్యదర్శి బోయ. వెంకటరాముడు, ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, కోశాధికారి రమేష్ రావు, సీనియర్ పాత్రికేయులు హరిగోపాలరావు, అక్బర్, పాత్రికేయులు శశిధర్, రామంజి,శ్రీనివాసులు,ప్రకాష్ ,ఆనందరాజు,హరి,గుడిసి చిన్న,ఖాజా వలి,గుమ్మనూరు హరి, సుబ్బయ్య,రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వశిష్ట బ్లడ్ డోనర్స్ సేవలు అభినందనీయం.

## దాతల సాయంతో చలివేంద్రం ఏర్పాటు.




**పోడూరు, మే 3, ప్రజా జ్యోతి న్యూస్ :** పోడూరులో ఏర్పాటైన వశిష్ట బ్లడ్ డోనర్స్ సేవలు అభినందనీయమని జనసేన నాయకులు, గ్రామస్తులు కొనియాడారు. పోడూరులో వశిష్ట బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో శనివారం కడలి రోహిత్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు పుచ్చకాయల చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వశిష్ట బ్లడ్ డోనర్స్ మాట్లాడుతూ గ్రామంలోని యువతలో చైతన్యం కలిగించేందుకే యువత ఐక్యత తో మెలిగేందుకే దాతల సహాయ సహకారాలతో సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తుంది అన్నారు.రక్తదానం, చలివేంద్రం, పేదలు వ్యాధి క్రమ ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందించడంతోపాటు గ్రామ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి వశిష్ట బ్లడ్ డోనర్స్ సాయంగా నిలవాలన్నదే సభ్యుల ముఖ్య ఉద్దేశం అన్నారు. గ్రామంలో కమిటీగా ఏర్పడి పేదలకు మేమున్నామంటూ భరోసా కల్పించడమే కమిటీ ఏర్పాటు ముఖ్య ఉద్దేశం అన్నారు. దేవుని ఆశీర్వాదం గ్రామ ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో మరెన్నో సేవలందించేలా వశిష్ట బ్లడ్ డోనర్స్ కృషి చేస్తారన్నారు.

## చేయూత సంస్థ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార సామాగ్రి పంపిణీ

**నిరంతరాయంగా కాకినాడ మరియు పిఠాపురంలో అన్నదాన కార్యక్రమం**



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ పిఠాపురం** చేయూత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గర్భిణీ స్త్రీలకు మరియు రోగుల సహాయకులకు భోజన పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని సంస్థ ప్రతినిధి డాక్టర్ యం. రవికుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సుదూర ప్రాంతాల నుండి గర్భిణీ స్త్రీలు వైద్య చికిత్సలకు వచ్చి సకాలంలో ఆహారం అందక ఆకలితో అలమటించడం గమనించి గత 5 సంవత్సరాలుగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చేస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి కొనసాగింపుగా పిఠాపురంలో 45 రోజులు నుండి నిరంతరాయంగా భోజన పంపిణీ కార్యక్రమం కొనసాగించడం జరుగుతుందని,నిరుపేద గర్భిణులు పౌష్టికాహార లోపం వలన ప్రసవ సమయంలో రక్తహీనతతో ఇబ్బందులు గురికావడం జరగడం గమనించి చేయూత సంస్థ సభ్యుల సహకారంతో పౌష్టికాహార కిట్స్ పంపిణీ చేయడం జరిగిందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత,అభివృద్ధి కమిటీ చైర్మన్ బొజ్జా కుమార్, చేయూత పిఠాపురం అన్నదాన కమిటీ సభ్యులు కాకి రాంబాబు,పిఠాపురం ఇంచార్జి శ్రీమాన్, సంస్థ సభ్యులు గరగ రామ్ పిఠాపురం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పండుగకై విస్తృతంగా విరాళాల సేకరణ

**ఆర్థిక సహాయాన్ని అందిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్న పట్టణ వాసులు**





**పొందూరు , జ్యోతి న్యూస్ :** వరాల కల్పవల్లి శ్రీ పొందూరు పైడితల్లి అమ్మవారి పండుగ నిర్వాహణకు పండుగ కమిటీ సభ్యులు విస్తృతంగా విరాళాలను సేకరిస్తున్నారు. పట్టణంలో పర్యటిస్తూ అమ్మవారి పండుగలో ప్రతీ ఒక్కరికి భాగస్వామ్యం కల్పిస్తున్నారు. పండుగ దిగ్విజయంగా జరిగేందుకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తమ వంతు సహకరంగా పట్టణ వాసులు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా గంగా భవాని కుమారుడు యఱ్రా వారి కళ్యాణమండపం యజమాని కాకర్ల సాయి చైతన్య రూ. 25 వేలు , చదువుల శ్యామలరావు సన్స్ రూ. 20 వేలు వీటితో పాటు పలువురు దాతలు వారికి తోచినంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గత కొన్ని రోజులుగా చేపడుతున్న విరాళాల సేకరణ కార్యక్రమానికి విశేషంగా స్పందన లభిస్తుందని ,ఇదే విధంగా ప్రతీ ఒక్కరూ తమ సహకారాన్ని అందజేసి పండగ ను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తోడ్పాటును అందించాలని పండుగ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి అనకాపల్లి శ్రీనివాసరావు ,రిటైర్డు కోరుకొండ విజయ్ కుమార్ ,గుడ్ల మోహన్ , మొకర సత్యన్నారాయణ (ఎం.ఎస్.ఎన్ ) , గాడు నాగరాజు , గుంటుకు రాము కాలేపు శ్రీనివాస రావు ( కేవీఆర్ ) , రిటైర్డు ఉపాధ్యాయులు బొడ్డేపల్లి జనార్ధన , పట్నాన శ్రీనివాస రావు , మాసాడ భోగిరాజు ,అనకాపల్లి చిన్న , మన్యాన వెంకట రావు , గిడిజాల భాస్కర రావు , ఆర్ రాంబాబు , అట్ల చంద్ర శేఖర్ , తదితర పండుగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు కొల్లాబత్తుల కి ఆహ్వానం.



**పోడూరు, మే 3,ప్రజాజ్యోతి న్యూస్.పాలకొల్లు** శ్రీశ్రీ కళావేదిక వారు ఏలూరులో నిర్వహించే148వ ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు పాలకొల్లు శంభుని పేటకు చెందిన ఉపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్య కుమార్ హాజరౌతున్నట్లు తెలిపారు. ఐ యస్ ఓ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక 10, 11 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు - సాహితీ పట్టాభిషేక మహోత్సవాలకు సీరియల్ నెం.164ని కేటాయిస్తూ శనివారం ఆహ్వానం అందిందని ఈసందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక అకాడమీ సి.ఇ.ఓ కత్తి మండ ప్రతాప్ కుమార్, కన్వీనర్ కొల్లి రమావతి, అధ్యక్ష కార్యదర్శులు జి.ఈశ్వరీ భూషణం, డా.టి.పార్థసారధిలకు కృతజ్ఞతలు సూర్య కుమార్ తెలిపారు. .

## ఇక చకచకా అమరావతి పనులు

**విజయవాడ :** ఏపీ రాజధాని అమరావతి ప్రాధాన్యత, ప్రత్యేకత, నిర్మాణంపై సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన కీలక వ్యాఖ్యలివి. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలతో ఏపీకి ఒక భరోసా, రాజధాని కల సాకారమైందన్న ఒక నమ్మకం కలిగినట్లు అయింది. రాజదాని అమరావతి నిర్మాణాన్ని మనం చెయ్యాలి?మనమే చెయ్యాలని మోదీ నొక్కిమరీ చెప్పారు. అంటే ఏపీలో ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పాడ్డాయి.కేంద్రంలో బీజేపీ సర్కార్ ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి పూచికపుల్లంతా అడ్డుకూడా రాదనేది మోదీ మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి కావాల్సిన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. కావాల్సిందల్లా రాజధాని నిర్మాణం..అదీ కేంద్రం సహకారంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని మోదీ స్పష్టంగా చెప్పకనే చెప్పారన్నారు.వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏంటి అన్నట్లుగా?కేంద్రంలో మోదీ సర్కార్ ఉండడంతో ఇక రాజధాని అమరావతి నిర్మాణానికి ఎవరూ అడ్డుపడరని..ఏదీ అడ్డు రాదని?చక చకా రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మించుకోవాలని ఫుల్ పవర్స్ ఇచ్చేశారు ప్రధాని మోదీ. 2019 ఎన్నికల్లో జగన్ సీఎం కావడంతో అమరావతి నిర్మాణానికి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెరపైకి తేవడంతో అప్పటివరకున్న అమరావతి తెరమరుగైంది.సీన్ కట్ చేస్తే ఏపీలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో రాజధాని అమరావతిపై ఐదుకోట్ల ఆంధ్రుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. మరోసారి ప్రధాని మోదీ అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించడంతో..ఐదు కోట్ల ఆంధ్రులు కన్న కలలు ఎట్టకేలకు సాకారం కాబోతున్నాయి.

## నరసాపురం పార్లమెంటులో మురళిరాజు పర్యటన

# పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపు






**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ప్రత్తిపాడు,** నరసాపురం పార్లమెంటు సమన్వయ కమిటీలో పార్లమెంటు పరిశీలికునిగా మొట్ట మొదటసారిగా ముదునూరి మురళి కృష్ణంరాజు పాల్గొన్నారు.ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి గ్రామస్థాయి నుండి నియోజవర్గ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మురళిరాజు పిలుపునిచ్చారు.ఏడు నియోజకవర్గాల్లో రానున్న సాధారణ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని,అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని అన్నారు.వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్రెడ్డి సీఎం అవడం ఖాయమని,గ్రామస్థాయి నాయకులు నుండి నియోజకవర్గ నాయకులు వరకు కష్టపడి పనిచేసే నాయకులను,ప్రజల తరఫున నిలబడి ప్రజల కష్టసుఖాలు నిలబడే నాయకులను పార్టీ గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించే విధంగా వైయస్ జగన్మోహన్రెడ్డి చర్యలు చేపడతారని మురళిరాజు అన్నారు.కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తించి వారిని పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్రెడ్డి 2.%వా% లో మొట్ట మొదటి తీసుకునే నిర్ణయం ఉంటుందని,కార్యకర్తలు సంక్షేమమే ధ్యేయగా పనిచేస్తారని మురళిరాజు అన్నారు.జగన్మోహన్రెడ్డి అధికారం లోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని, నిరుపేదలకు యువతకు, మహిళలకు,రైతన్నలకు కార్మికకులుకు అన్ని వర్గాల ప్రజలకి మేలు జరుగుతుందన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని,నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల మీద పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు,మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు,ఉండి నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎల్ నరసింహ రాజు,పాలకొల్లు సమన్వయకర్త గుడాల గోపి,ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్,ఎంపీపీలు, జడ్పిటిసిలు,పార్లమెంట్ సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ వివిధ అనుబంధ సంఘ అధ్యక్షులు సభ్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో రైతులకు మహర్దశ






**అమరావతి రాజధాని సభ రైతుల విజయమే.**

**కూటమి ప్రభుత్వంలో రైతులు సంతృప్తిగా ఉన్నారు.**

**రూ. 1.08 కోట్లతో కోటి అభివృద్ధి పనులకు శ్రీకారం**

**పోడూరు, మే 3, ప్రజాజ్యోతి న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం తో పాటు పాలకొల్లు నియోజకవర్గంలోనూ రైతులకు మహర్దశ అని, రైతుల అన్ని విధాల సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు- మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు నియోజకవర్గంలో కొమ్ముచిక్కాల, అరట్లకట్టలో రూ. 1.08 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 23.70 లక్షలతో కొమ్ము చిక్కాల గ్రామంలో కర్ణాల పుంత దగ్గర లో రాపాక చానెల్ పై గ్రావెల్ రహదారుల పనులు, 27.70 లక్షలతో గ్రామ పంచాయతి దగ్గరలో రాపాక చానెల్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, 15 లక్షలతో అరట్లకట్ట గ్రామంలో అరట్ల కట్ట బ్రాంచ్ చానల్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, 41.50 లక్షలతో రాపాక చానెల్ పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ముందుగా ఆయా గ్రామాల్లో మంత్రి రామానాయుడుకు పెద్ద సంఖ్యలో రైతులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రైతుల కష్టం కన్నీళ్లు తెలిసిన వాడిగా నిరంతరం రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం పనిచేస్తున్నానని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం లో నా నియోజకవర్గ పరిధి కొమ్ముచిక్కాల నుంచి తిల్ల పూడి పాలెం శివారు వరకు రాపాక ఛానల్ వెంబడి నాలుగైదు సార్లు పాదయాత్ర జరపగా గట్టు వెంబడి వెళ్లే పరిస్థితి లేక సమీప కొబ్బరి తోటలు,పుంతలు, రైల్వే ట్రాకుల గుండా వెళ్ళవలసి వచ్చింది అన్నారు. రైతులు నడవడానికి కాకుండా పండిన ధాన్యాన్ని తెచ్చుకునే పరిస్థితులు లేవని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వంలో కాలవల వెంబడి రహదారుల నిర్మాణం చేపట్టామని, మళ్లీ కూటమి ప్రభుత్వంలో పెద్ద ఎత్తున చేపడుతున్నామని ఇక ఎటువంటి కష్టాలు ఇబ్బందులు ఉండవని రైతులే సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. గత ప్రభుత్వం రైతులను, వ్యవసాయాన్ని, ఇరిగేషన్ ను పట్టించుకోలేదన్నారు. నేడు చివరి ఎకరాకు సమృద్ధిగా నీరు అందిందని, ఎకరానికి 60 నుంచి 65 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని, ధాన్యం అమ్మిన రెండు మూడు రోజుల్లో బ్యాంక్ ఖాతాలో సొమ్ములు జమవుతున్నాయని రైతులు సంతోషంగా చెబుతున్నారన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి రాజధాని లేదని నేడు అమరావతి రాజధాని రైతుల విజయమే అన్నారు. చంద్రబాబు ప్రపంచ స్థాయి రాజధాని ఏర్పాటు ద్వారా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగబోతాయి అన్నారు. ప్రధానంగా రాజధాని సంపద ద్వారా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ 26 జిల్లాల్లోనూ అభివృద్ధి, సంక్షేమానికి కొదవ ఉండదన్నారు. రైతు సంక్షేమంగా పనిచేసే కూటమి ప్రభుత్వానికి రైతంగం అండగా నిలవాలని మంత్రి రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మాజీ ఎంపీపీ దాసరి రత్నరాజు, గొట్టుముక్కల రఘు, జిన్నూరు మాజీ సర్పంచ్ పాలవలస తులసి రావు,మట్టపర్రు మాజీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు, టిడిపి పాలకొల్లు నియోజవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు యల్లమెల్లి వెంకట్రావు, తుల రామలింగేశ్వరరావు, ఉనమట్ల కబర్థి పోత్తూరి కుమార్ స్వామి రాజు, చింతపల్లి సత్యనారాయణ పోత్తూరి విజయకుమార్ రాజు, కోడేటి రాంబాబు, చింతపల్లి శ్రీనివాసు, చింతపల్లి లక్ష్మీ కుమార్ ఇ జక్క%శీ% శెట్టి సత్యనారాయణ, రామకృష్ణ, , అందే కోటి వీరభద్రం, సాగర్ సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు

# వైభవంగా పైడితల్లమ్మకు ఉయ్యాల సేవ





**మేళ తాళాలు , డప్పు వాయిద్యాల మధ్య ఉయ్యాల ఊగిన పైడితల్లమ్మ**

**పురవీధులలో ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు**

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** అడిగిందే తడువుగా ఇచ్చే తల్లి కోరికలు తీర్చే కల్పవల్లి శ్రీ పొందూరు పైడితల్లి అమ్మవారిని వేడుకుంటే చాలు ఆపదలు దరి చేరవని భక్తుల విశ్వాసం. పంట సిరులతో, వ్యాపారులకు కాసుల పంటతో ,పిల్లలకు విద్యాబుద్దులు ,మహిళలకు సౌభాగ్యం ప్రసాదించి, ప్రకృతి వైపరిత్యాలు ,దుష్ట శక్తులు దరి చేరకుండా గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామ పెద్దలంతా కలిసి అమ్మవారిని పండుగను నిర్వహించేందుకు పూనుకున్నారు. ఈ మేరకు అమ్మవారి పండుగ కమిటీ ,ఆలయ కమిటీ ,గ్రామ దేవతల పూజారులు ( దమ్మల వారు ) గ్రామ పొలిమేర నుండి అమ్మవారిని వైభవంగా గ్రామంలోకి తీసుకువచ్చి ఐదు రోజులు కావడంతో అమ్మవారికి ఉయ్యాల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా పొందూరు మండల కేంద్రంలో అంగటి వీధిలో అనకాపల్లి శివకుమార్ పర్యవేక్షణ లో గ్రామ దేవతల నిలయం వద్ద వేపచెట్టు కర్రలతో ఉయ్యాలను ఏర్పాటు చేశారు. ఈ ఉయ్యాలని వేపాకులతో , వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉయ్యాల సేవా నిర్వహించే రోజున ఉదయం గ్రామ పెద్దలకు సమాచారం అందజేసి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునివ్వడం ఇక్కడ తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ . గ్రామ పెద్దలు ,గ్రామ దేవత పూజారులు ఒక చోటుకు చేరుకుని ఆహ్లాదకరమైన వాతావరణం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోకి వచ్చిన అమ్మవారిని ఆనందింప చేసేందుకు మేళ తాళాలు , డప్పు వాయిద్యాల మధ్య గ్రామ దేవతల పూజారి అయిన పోలాకి రామారావు అమ్మవారి ప్రతిమ గల బుట్టను తలపైన ధరించి ఉయ్యాల ఊగారు.అనంతరం నాయుడు , కర్ణం కుటుంబీకులు,పోలాకి వారి కుటుంబానికి చెందిన తదితర గ్రామదేవత పూజారులు అమ్మవారి ఉయ్యాల సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తండోప తండాలుగా తరలివచ్చారు. ఉయ్యాల సేవ అనంతరం గ్రామ పురవీధులలో అమ్మవారి ఘటాలను ఘనంగా ఊరేగించారు. ఉయ్యాల సేవా నాటి నుండి పండుగ ముగిసే వరకు ప్రతీ నిత్యం సంధ్యాస్తమయం తరువాత గ్రామ పురవీధులలో అమ్మవారిని ఘనంగా ఊరేగిస్తారు.

# 85 కిలోమీటర్లకు మెట్రో డీపీఆర్ రెడీ



**హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రెండో దశ 'బి' భాగంగా జేబీఎస్ నుండి మేడ్చల్ (24 కి.మీ.), జేబీఎస్ నుండి శామీర్‌పేట (21 కి.మీ.), శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ (40 కి.మీ.) వరకు మూడు కీలకమైన మెట్రో మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఆమోదం తర్వాత రాష్ట్ర మంత్రివర్గం చర్చించి కేంద్రానికి పంపుతుంది. జేబీఎస్ వద్ద ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేయాలని కూడా ప్రతిపాదన ఉంది.. దీని రూపకల్పన జపాన్‌లోని రవాణా వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుంటుంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ తన రెండో దశ విస్తరణకు వేగంగా అడుగులు వేస్తోంది. రెండో దశ 'బి'లో భాగంగా ప్రతిపాదించిన కీలకమైన మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ఈ డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదించాల్సి ఉంది. బోర్డు ఆమోదం తర్వాత.. రాష్ట్ర మంత్రివర్గం దీనిపై చర్చించి ఆమోదం తెలుపుతుంది. అనంతరం.. తుది అనుమతి కోసం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. రెండో దశ 'బి'లో హైదరాబాద్ నగరంలోని ఉత్తర ప్రాంతాలకు మెట్రో అనుసంధానాన్ని విస్తరించేందుకు ముఖ్యమైన ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) నుండి మేడ్చల్ వరకు 24 కిలోమీటర్ల మేర ఒక మార్గం, అలాగే జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు 21 కిలోమీటర్ల మేర మరొక మార్గం ప్రతిపాదించబడ్డాయి. వీటితో పాటు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవైన మెట్రో మార్గం యొక్క డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు. విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుండి ప్రారంభమై.. కొత్తగా ప్రతిపాదించిన మెట్రో రైలు డిపో పక్కనుంచి.. విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి ఆకాశ మార్గంలో కొనసాగుతుంది. ఇది మాన్సాన్‌పల్లి, బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్, తుక్కుగూడ ఎగ్జిట్, రావిర్యాల్ ఎగ్జిట్ వరకు సర్వీస్ రోడ్డులో వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. అక్కడి నుండి, ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి ద్వారా కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ , మీర్‌ఖాన్‌పేట వరకు దాదాపు 22 కిలోమీటర్ల మేర ఈ మార్గం విస్తరించనుంది. ఈ డీపీఆర్‌ను మొదట హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ బోర్డుకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ఎండీతో పాటు పురపాలక, పట్టణాభివృద్ధి, ఆర్థిక, పరిశ్రమలు, ఐటీ శాఖల కార్యదర్శులు మరియు హెచ్ఎండీఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు.. జేబీఎస్ వద్ద 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రితో పాటు జపాన్ పర్యటనకు వెళ్లిన మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అక్కడి అనుభవాలను ఈ మెట్రో హబ్‌లో పొందుపరిచేందుకు కృషి చేస్తున్నారు. జపాన్‌లో బుల్లెట్ రైళ్లు, మెట్రో , సాధారణ రైలు సదుపాయా లు ఒకదానితో మరొకటి అనుసంధానించబడి ఉంటాయి. ప్రయాణికులు ఒక రైలు నుండి మరొక రైలుకు సులభంగా మారేలా ఈ వ్యవస్థ రూపొందించబడింది. ఇదే తరహా అనుసంధాన వ్యవస్థను జేబీఎస్ మెట్రో హబ్‌లో కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

**వివరాలు పంపించండి... కిషన్ వినతి**

నగరంలో మెట్రోరైలు విస్తరణ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశించారు. కేంద్రమంత్రి ఆధ్వర్యం లో శుక్రవారం ఎంసీహెచ్ హెచ్ఆర్డీలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. కేంద్రనిధులతో జరుగుతున్న కార్యక్రమాలపై కేంద్రమంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వ హించారు. మెట్రోరైలు ప్రాజెక్టులో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన ఫస్ట్ ఫేజ్ ను విస్తరించి.. సెకండ్, థర్డ్, ఫోర్త్ ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్రప్రభుత్వానికి పంపించాలని సూచిస్తున్నట్లు తెలిపారు. మెట్రోరైలు వివరాలు అందితే కేంద్రప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు, రుణాలు లభించేలా సహకరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ సిటీ అని.. అభివృద్ధి అంటే కేవలం హైటె క్ సిటీ కాదని.. ఓల్డ్ సిటీ, గౌలిగూడ, అం బర్‌పేట్, సనత్‌నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని అన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, పాతబస్తీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, ప్రాథమిక సౌకర్యాల సమస్యలు మరింతగా తలెత్తుతున్నాయని.. హైటెక్ సిటీతో పా టు ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందు కు సాగాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ సంస్థలు నగర మౌలిక వసతుల కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, నిధుల కొరత లేకుండా చూ సేందుకు చర్యలు తీసుకోవాలన్నా రు. జీహెచ్ఎంసీ ఊహించని స్థాయి లో విస్తరిస్తూ జనాభా భారీగా పెరుగుతున్న నేప థ్యంలో మౌలికవ సతులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టే పథకాలకు రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించకపోవడం వల్లే నిధులు ఖర్చు చేయ లేని దుస్థితి ఏర్పడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. అధికారులు రాష్ట్రంలోని సమస్యలను తమ దృష్టి కి తీసుకువస్తే కేంద్రం నుంచి ఎన్ని నిధులైనా తీసుకువస్తామని తెలిపారు.

# 8న హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభం



**హైదరాబాద్ :** భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత, చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది హైడ్రా. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం హైడ్రా విభాగానికి మరిన్ని అధికారాలు అప్పగించింది. కొన్ని రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించినట్లుగా.. త్వరలోనే నగరంలో ప్రత్యేక హైడ్రా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. దీనిలో భాగంగా.. ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి రేవంత్ సర్కార్ గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. బుద్ధభవన్‌లోని బీ-బ్లాక్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. అలానే హైడ్రాకి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం రేవంత్ సర్కార్ ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. హైడ్రా ఏర్పాటుపై ప్రశ్నలు రావడంతో.. సర్కార్ జీహెచ్ఎంసీ చట్టం 1955ను సవరించింది. నగరంలోని జలాశయాలు, ఇతర ఆస్తులను కాపాడేందుకు అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెడుతూ.. జీహెచ్ఎంసీ చట్టంలో కొత్తగా 374 బి సెక్షన్‌ను చేర్చింది. ఇక త్వరలో ప్రారంభం కానున్న హైడ్రా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్ఓగా ఏసీపీ స్థాయి అధికారి ఉండనున్నట్లు సమాచారం. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం అంతా హైడ్రా పోలీసు స్టేషన్ పరిధిలోనికి రానున్నట్లు తెలుస్తుంది. ఓఆర్ఆర్ లోపల ఎక్కడ ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా అయినా.. ఇకపై హైడ్రా పోలీసు స్టేషన్‌లోనే కేసులు నమోదు చేయనున్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ రాకతో.. ఇకపై నగరంలో.. చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల వ్యవహారంలో జరిగే అక్రమ ఆక్రమణలపై స్థానికులు, అధికారులు నేరుగా హైడ్రా పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటివరకు సాధారణ పోలీస్ స్టేషన్లలో నమోదైన భూకబ్జా కేసులపై హైడ్రా దాడులు జరుపుతూ వస్తోంది. అయితే త్వరలోనే ఈ కేసులు సాధారణ పోలీసు స్టేషన్ల నుంచి హైడ్రా స్టేషన్‌కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. హైడ్రా పోలీసు స్టేషన్ వల్ల ఈ కేసులు తర్వగా పరిష్కారం అయ్యే అవకాశం కూడా ఉంది అంటున్నారు

# పారిశుద్ధ కార్మికులకు ఎమ్మెల్యే బట్టలు పంపిణీ



**పెద్దపల్లి :** పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికులకు బట్టలు, ఈ.ఎస్.ఐ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ మే డే రోజు నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం, అనివార్య కారణాలవల్ల ఈ రోజు అందించి నట్లు తెలిపారు. మేడే అంటే కార్మికులు హక్కుల కోసం పోరాడి సాధించుకున్న రోజని అన్నారు. పారిశుధ్య కార్మికులు కష్టపడి పని చేస్తున్నారని, వారి పని విధానాన్ని మెరుగుపరుచు కొని, విధులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్లను, చెత్తను కొందరు పట్టణ ప్రజలు డ్రైనేజీలో, వ్యాపారులు రోడ్లపై వేస్తున్నారని దీనివల్ల పారిశుద్ధ్య కార్మికులకు ఇబ్బంది అవుతుందని, వారు చేసే పని మనం కూడా చేస్తే వారి కష్టం విలువ తెలుస్తుందని పేర్కొన్నారు. మన పరిసర ప్రాంతాలను మనమే పరిశుభ్ర పరుచుకుంటూ చెత్తను డబ్బాలలో వేసి, మీ వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. పెద్దపల్లి పట్టణంలో 25 కోట్ల 60 లక్షల రూపాయల అమృత్- 2 నిధులతో రెండు వాటర్ ట్యాంకులతో పాటు, పైప్ లైన్ల నిర్మాణం ద్వారా చివరి ప్రాంత ప్రజలకు ఈ నల్లా కనెక్షన్లు ఇచ్చే పనులు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలో వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా వాటర్ మేనేజ్మెంట్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. అర్హుల జాబితాలో పేరు ఉండి, ఇంటి స్థలం ఉన్న పారిశుద్ధ్య కార్మికులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు రైతుల విలవిల.....

## రోడ్డు ఎక్కిన అన్నదాతలు?

**నాయకుల,అధికారుల నిర్లక్ష్యం వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్?.**

**రైతులకు అండగా ఉంటామని బి.ఆర్.ఎస్ నాయకుల భరోసా..**

**వనపర్తి :** రాత్రి కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మార్కెట్ యార్డ్ నందు పరిశీలించి ప్రభుత్వం ధాన్యాని కొనుగోలు చేసేవరకు పోరాడుతామని బి.ఆర్.ఎస్ నాయకులు రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్,పి.రమేష్ గౌడ్,మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,పి.ఏ.సి.ఎస్ అధ్యక్షులు వెంకట్రావ్,రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత నెల రోజుల క్రితం వచ్చిన ధాన్యాని గన్ని బ్యాగులు లేవని,ట్రాన్స్‌ఫోర్ట్ లేదని నేటి వరకు కొనుగోళ్లు చేయకపోవడం వల్ల 30వేల బస్తాలు నీటి పాలు అయినాయని ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఈ యాసంగిలో 75లక్షల బస్తాలు మార్కెట్ యార్డ్ కు వస్తాయని అంచనా ఉన్నా పర్యవేక్షణ లేక రైతులను ఈ ప్రభుత్వం నట్టేట మంచిదని విమర్శించారు. రైతులతో కలసి దాదాపు గంటసేపు రాస్తారోకో చేసి వాహనాలను స్తంభింపజేసి తమ నిరసన తెలిపారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ తడసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన తర్వాత రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల. అశోక్, గంధం.పరంజ్యోతి,భానుప్రకాష్ రావు,మహేశ్వర్ రెడ్డి,ధర్మా నాయక్,నాగన్న యాదవ్, ఉంగ్లం. తిరుమల్,పిగులాం ఖాదర్ ఖాన్,సూర్యవంశం.గిరి,ఇమ్రాన్, జోహెబ్ హుస్సేన్, సునీల్ వాల్మీకి,చిట్యాల రాము, పాషా,నారాయణ నాయక్,రైతులు పాల్గొన్నారు

## పందిళ్ళపల్లి - మత్కేపల్లి బీటీ రహదారి నిర్మాణాన్ని పరిశీలించిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు, రైతులు

**భట్టి విక్రమార్క కి ప్రత్యేక కృతజ్ఞతలు**

మధిర నియోజకవర్గం చింతకాని మండలం పరిధిలోని పందిళ్ళపల్లి నుండి మత్కేపల్లి వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణ పనులు గ్రామస్థుల ఆశలకి కొత్త దారితెరిచాయి. రూ. 8 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కలిసి ఈ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల నాణ్యత, వేగం, స్థానిక అవసరాలకు అనుగుణంగా సాగుతున్న నిర్మాణం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా రైతులు ఈ రహదారి ద్వారా తమ పంటలను సమీప మార్కెట్లకు తేలికగా తరలించగలుగుతారు. దీనివల్ల రవాణా ఖర్చు తగ్గి, పంటల లాభదాయకత పెరగనున్నది. గ్రామ నాయకులు మాట్లాడుతూ, ఈ రహదారి నిర్మాణం పూర్తయిన తరువాత పందిళ్ళపల్లి, మత్కేపల్లి మాత్రమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా పెద్దఎత్తున ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఆయా గ్రామాల అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఈ రహదారి నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలని ప్రభుత్వ అధికారులను, కాంట్రాక్టర్లను గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల సహకారంతో ఇది త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా మాత్కేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు రైతులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల అభివృద్ధిపై ఆయన చూపిన ప్రత్యేక శ్రద్ధకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సిటిజన్ కానిస్టేబుల్స్


**హైదరాబాద్ :** రాంగ్‌రూట్‌లో వెళ్తే ట్రాఫిక్ పోలీస్ ఫోటో కొట్టి ఫైన్ వేయడం మనకు తెలిసిన విషయమే. అయితే ఎక్కడైనా ట్రాఫిక్ పోలీస్ లేదని తెలిస్తే మాత్రం వాహనదారులు మొత్తం ఇష్టం వచ్చినట్లు వెళ్తూ ఉంటారు. రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు కారణమైన వారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అందుకే ఇప్పుడు ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులను ఎవరైనా ఫోటో తీసి పంపిస్తే.. అలాంటి వారికి జరిమానాలు వేసే నిర్ణయం తాజాగా అమల్లోకి వచ్చింది. హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ వాహనాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అదే సమయంలో ట్రాఫిక్ కూడా నిత్యం పెరుగుతూనే ఉంది. ఇక ట్రాఫిక్ ఉల్లంఘించి వెళ్లే వాహనదారుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. దీంతో ఎక్కడికక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు.. అందులో రాంగ్ రూట్ కారణంగా జరిగే ప్రమాదాలు, మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారుల భరతం పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్తే వారికి జేబులు చిల్లులు పడేలా ఫైన్లు వేస్తున్నారు. అయితే ఇదంతా ట్రాఫిక్ పోలీసులు ఉండే జంక్షన్ల మాత్రమే ఇప్పటివరకు ఉండేది. కానీ ఇక నుంచి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి రాంగ్ రూట్ డ్రైవింగ్ లేకుండా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే ట్రాఫిక్ పోలీస్ లేని ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారుల ఫోటోలు తీసే అధికారాన్ని సాధారణ ప్రజలకు, వాహనదారులకు కల్పించారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్లినట్లు గమనిస్తే.. వారి వాహనం ఫోటో తీసి తమకు పంపిస్తే.. అలాంటి వారికి ఫైన్లు విధిస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ఆసక్తికరమైన ట్వీట్ పెట్టారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాల ఫోటోలు, వీడియోలు తీసి పంపాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి ఫోటోలు వీడియోలను తమ వాట్సాప్ నెంబర్ 9490617346కు పంపించాలని.. వాటితోపాటు ఆ వాహనం లొకేషన్, టైమ్, డేట్ వంటి పూర్తి వివరాలను పంపించాలని ట్వీట్‌లో సూచించారు. పంపిన వివరాలను సేకరించి.. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి.. రాంగ్ రూట్‌లో వెళ్లిన వాహనదారులకు జరిమానాలు విధించి.. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ముక్కుపిండి వసూలు చేయనున్నారు. మే 1వ తేదీ నుంచే ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో వాహనదారులు ప్రయాణాలు చేయకుండా ఉండేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చిన ఈ రూల్‌కు సంబంధించిన ట్వీట్‌కు నెటిజన్లు మద్దతు తెలుపుతూ రీట్వీట్లు, కామెంట్లు చేస్తున్నారు.

## మే 4 వ తేదీన నీట్ పరీక్ష నిర్వహణ సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**కర్నూలు :** మే 4 వ తేదీన నీట్ జఉ పరీక్ష నిర్వహణ సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. సోమవారం నీట్ జఉ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్ లు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4 వ తేదీన నీట్ జఉ పరీక్ష కర్నూలు నగరం లోని 16 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.. పరీక్షకు 4466 విద్యార్థులు హాజరు కానున్నారన్నారు.. ఈ పరీక్ష మే 4 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. పరీక్ష నిర్వహణ లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రం వద్ద 2+2 పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.. అలాగే పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కేంద్రాల వద్ద 163 ఃఔఐూ బవఀబితినీని విధించాలని తహసీల్దార్ లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సౌకర్యం ఉండాలని,తాగు నీటి వసతి కల్పించాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సరైన సమయానికి చేరుకునేందుకు అవసరమైన బస్సు సదుపాయాలు కల్పించాలని, రవాణా విషయంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల దగ్గర మెడికల్ స్టాఫ్ తో పాటు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద దివ్యాంగ విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా సెంటర్ కు 3,4 వీల్ చైర్ ల చొప్పున ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. సెంటర్లలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ముందుగా విజిట్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. ప్రశ్నపత్రాలను సేఫ్ కస్టడీ లో ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్వో ను ఆదేశించారు.. జిల్లా స్థాయిలో ఒక హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డీఆర్వో ను ఆదేశించారు.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదేశించిన విధంగా నీట్ జఉ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు..

# ఒకే ఒక్క గ్లాస్ మీ జీవితాన్నే మార్చేస్తుంది



చిన్నప్పటి నుంచి ఆరోగ్య నిపుణులు, మన తల్లిదండ్రులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగమని సలహా ఇస్తున్నారు. ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగితే కడుపు పూర్తిగా శుభ్రం అవుతుందని చెబుతారు.. అయితే.. చాలా మంది దీన్ని లైట్ తీసుకుంటారు.. కానీ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల ఏమి జరుగుతుందో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? చిన్నప్పటి నుంచి ఆరోగ్య నిపుణులు, మన తల్లిదండ్రులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగమని సలహా ఇస్తున్నారు. ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగితే కడుపు పూర్తిగా శుభ్రం అవుతుందని చెబుతారు.. అయితే.. చాలా మంది దీన్ని లైట్ తీసుకుంటారు.. కానీ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల ఏమి జరుగుతుందో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మీరు ఉదయాన్నే గోరువెచ్చని నీరు త్రాగడం అలవాటు చేసుకుంటే... ఈ సాధారణ అలవాటు మీ జీవితంలో చాలా పెద్ద, సానుకూల మార్పులను తీసుకురాగలదు. ఇది మాత్రమే కాదు, ఆయుర్వేదం నుండి సైన్స్ వరకు, ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు త్రాగడం ప్రయోజనకరంగా పరిగణిస్తారు. నిద్రలేవగానే ఉదయాన్నే గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది..? ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకోండి.. జీర్ణవ్యవస్థ బలంగా ఉంటుంది: ఉదయాన్నే గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మీ జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది కడుపులో పేరుకుపోయిన గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం వంటి సమస్యలను తొలగించడంలో సహాయపడుతుంది. మీరు ఉదయం గోరువెచ్చని నీరు త్రాగినప్పుడు, అది మీ పేగు కండరాలను సడలించి, ప్రేగు కదలికలు సులభంగా జరుగుతాయి. ఇది మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.. కడుపు తేలికగా అనిపిస్తుంది. డీటాక్సిఫికేషన్: ఉదయాన్నే గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల శరీరం డీటాక్సిఫికేషన్ పొందుతుంది. గోరువెచ్చని నీరు శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తాగితే, శరీరం లోపలి నుండి శుభ్రపడి, చర్మం కాంతివంతంగా మారుతుంది. కొంతమంది దీనికి నిమ్మకాయ, తేనె కలుపుకుని తాగుతారు.. ఇది నిర్విషీకరణ ప్రక్రియలో మరింత సహాయపడుతుంది. జీవక్రియను పెంచుతుంది: మీరు బరువు తగ్గాలనుకుంటే, గోరువెచ్చని నీరు మీకు సహాయపడుతుంది. ఇది శరీరం జీవక్రియ రేటును పెంచుతుంది.. దీని కారణంగా కేలరీలు వేగంగా కరుగుతాయి. సమాచారం ప్రకారం, ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల రోజంతా శక్తి లభిస్తుంది.. శరీరం చురుకుగా ఉంటుంది. రక్త ప్రసరణ: ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. వేడి నీరు రక్త ధమనులను విస్తరిస్తుంది.. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది గుండె ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది గుండె కండరాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది.. ఇంకా రక్తపోటును కూడా నియంత్రిస్తుంది. ప్రకాశవంతమైన చర్మం: ఉదయాన్నే గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల చర్మం కూడా ప్రకాశవంతంగా ఉంటుంది. శరీరం లోపలి భాగాన్ని సరిగ్గా శుభ్రం చేసినప్పుడు, దాని ప్రభావం ముఖంపై కూడా కనిపిస్తుంది. గోరువెచ్చని నీరు చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది.. మొటిమలు, ముడతలను తగ్గిస్తుంది. చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఉదయాన్నే గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుంది.

# ఇలాంటి లక్షణాలు కనిపిస్తే యూరిన్ ఇన్ఫెక్షనే..

వేసవిలో తరచుగా మూత్ర సంక్రమణ సమస్య ఉంటుంది. అయితే, దాని లక్షణాలు చాలా తక్కువగా కనిపిస్తాయి.. ఇన్ఫెక్షన్‌ను త్వరగా గుర్తించలేము. మూత్ర సంక్రమణ చాలా కాలం పాటు కొనసాగడం వల్ల అనేక తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. మూత్ర సంక్రమణ మూత్రాశయం, మూత్ర నాళం, మూత్రపిండాలకు సంబంధించిన తీవ్రమైన సమస్యలను కూడా కలిగిస్తుంది. వేసవిలో తరచుగా మూత్ర సంక్రమణ సమస్య ఉంటుంది. అయితే, దాని లక్షణాలు చాలా తక్కువగా కనిపిస్తాయి.. ఇన్ఫెక్షన్‌ను త్వరగా గుర్తించలేము. మూత్ర సంక్రమణ చాలా కాలం పాటు కొనసాగడం వల్ల అనేక తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. మూత్ర సంక్రమణ మూత్రాశయం, మూత్ర నాళం, మూత్రపిండాలకు సంబంధించిన తీవ్రమైన సమస్యలను కూడా కలిగిస్తుంది. అందువల్ల, యూరిన్ ఇన్ఫెక్షన్ లక్షణాలను త్వరగా గుర్తించి, దానికి చికిత్స పొందడం, తీవ్రమైన అనారోగ్యాన్ని నివారించడం చాలా ముఖ్యం.. అయితే.. వేసవిలో మూత్ర విసర్జనలో మార్పు అనిపిస్తే, వెంటనే మీ శరీరాన్ని హైడ్రేట్ చేయడం ప్రారంభించండి. ఇది ప్రారంభ దశలోనే యూరిన్ ఇన్ఫెక్షన్ ను నయం చేస్తుందని.. వైద్య నిపుణులు చెబుతున్నారు. మూత్ర సంక్రమణ అనేది మూత్ర నాళంలో (మూత్రపిండాలు, మూత్రాశయం, మూత్రనాళం) వచ్చే సంక్రమణం. ఇది సాధారణంగా బ్యాక్టీరియా ద్వారా జరుగుతుంది.. అయితే కొన్నిసార్లు వైరస్ లేదా శిలీంధ్రాల ద్వారా కూడా సంక్రమణ సంభవించవచ్చు. వేసవిలో, డీహైడ్రేషన్ కారణంగా మూత్ర సంక్రమణ తరచుగా సంభవిస్తుంది. వేడిలో తిరగడం వల్ల డీహైడ్రేషన్ ఏర్పడి .. దీనివల్ల యూరిన్ ఇన్ఫెక్షన్ వస్తుంది.. ఈ విషయాలను గుర్తుంచుకోవాలి.. దీనిని త్వరగా గుర్తించలేము. అయితే, మూత్ర సంక్రమణ ప్రారంభంలో కొన్ని లక్షణాలు బయటపడతాయి. కానీ ఆ లక్షణాలు చాలా తక్కువగా ఉంటాయి.. రోగులు వాటిని విస్మరిస్తారు. దీని కారణంగా ఇన్ఫెక్షన్ చాలా కాలం పాటు ఉంటుంది.. దాని కారణంగా అనేక తీవ్రమైన వ్యాధులు రోగిని చుట్టుముడతాయి. తరచూ మూత్ర సంక్రమణ మూత్రపిండాల్లో రాళ్లకు కారణమవుతుంది. ఇది కాకుండా, మూత్ర నాళంలో ఇన్ఫెక్షన్ ఉండవచ్చు.. ఇది చాలా నొప్పిని కలిగిస్తుంది. కొన్నిసార్లు యూరిన్ ఇన్ఫెక్షన్ కారణంగా యూరినరీ ట్రాక్ట్ కూడా ఇరుకుగా మారుతుంది.. దీనికి చికిత్స చేయడం చాలా కష్టమవుతుంది. వేసవిలో, డీహైడ్రేషన్ వల్ల కలిగే యూరిన్ ఇన్ఫెక్షన్ లక్షణాలు చాలా తక్కువగా ఉంటాయి. వీటిలో మూత్ర విసర్జన విధానంలో మార్పు.. రోజుకు రెండు లేదా మూడు సార్లు మాత్రమే మూత్ర విసర్జన చేయడం వంటివి ఉంటాయి. మూత్ర విసర్జన చేస్తున్నప్పుడు కొంచెం మంటగా అనిపించడం. మూత్రం పసుపు లేదా ముదురు రంగులోకి మారడం. మూత్ర నాళంలో ఎల్లప్పుడూ కొంచెం మంటగా అనిపించడం. ఇవి నిర్జలీకరణం వల్ల కలిగే మూత్ర సంక్రమణ ప్రారంభ లక్షణాలు.. డీహైడ్రేషన్ వల్ల మూత్ర ఉత్పత్తి తగ్గుతుంది. దీని కారణంగా మూత్ర నమూనా మారుతుంది. ఇది మొదటగా కనిపించే లక్షణం, కానీ రోగులు దీనిని విస్మరిస్తారు. ఈ లక్షణం కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వేసవిలో మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్ గా ఉంచుకోండి. రోజంతా తగినంత నీరు త్రాగండి.. ఎండలో బయటకు వెళ్ళినప్పుడు నీటిని ఎక్కువగా తాగండి.. మీరు నీళ్లు తాగకపోతే ఖచ్చితంగా వేరే ఏదైనా ద్రవం తాగండి. లస్సీ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం. సత్తు, రసం మొదలైనవి మిమ్మల్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడతాయి. వేసవిలో మూత్ర విసర్జనలో మార్పు అనిపిస్తే, వెంటనే మీ శరీరాన్ని హైడ్రేట్ చేయడం ప్రారంభించండి. ఇది ప్రారంభ దశలోనే మూత్ర సంక్రమణను నయం చేస్తుంది. వీలైనంత తక్కువగా ఎండలో బయటకు వెళ్లండి. మూత్ర సంక్రమణ.. అలాగే ఇతర లక్షణాలు ఇంకా కనిపిస్తే, వైద్యుడిని సందర్శించడంలో ఆలస్యం చేయవద్దు.





# నీటిలో వెండి కలుపుకుని తాగితే ఏమవుతుంది?

రాగి పాత్రలు లేదా మట్టితో చేసిన కుండలోని వాటర్ తాగితే ఆరోగ్యానికి మంచిదని, అవి సహజ వాటర్ ఫిల్టర్‌గా పని చేస్తాయని నిపుణులు చెబుతారు. ఇక వెండితో కలిపిన నీరు తాగితే అంతకు మించిన ప్రయోజనాలు ఉన్నాయని కొంతమంది ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు. అయోడిన్.. వీటిని మార్కెట్లలో టాబ్లెట్ రూపంలో దొరుకుతాయి. వీటిని నీటిలో కలపడం వల్ల నీరు శుద్ధి అవుతాయి. కానీ ఈ పద్ధతిని ఖచ్చితంగా అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించాలి. లేదంటే ఎలక్ట్రిక్ ప్యూరిఫైయర్లను కూడా ఉపయోగించవచ్చు. రాగి పాత్రలు లేదా మట్టితో చేసిన కుండలోని వాటర్ తాగితే ఆరోగ్యానికి మంచిదని, అవి సహజ వాటర్ ఫిల్టర్‌గా పని చేస్తాయని నిపుణులు చెబుతారు. ఇక వెండితో కలిపిన నీరు తాగితే అంతకు మించిన ప్రయోజనాలు ఉన్నాయని కొంతమంది ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు. సర్టిఫైడ్ ఫిట్‌నెస్ కోచ్ తేజల్ ఫరేఖ్ అనే వ్యక్తి ఆచరించి చూపిస్తున్నాడు. ఈ విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అతను ఒక కుండ నీటిలో వెండి నాణెం వేసి తాగుతున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. “నేను 10 సంవత్సరాలకు పైగా నా నీటి కుండలో వెండి నాణెం ఉంచుతున్నాను. ఇది నా కుటుంబ ఆరోగ్యానికి, ముఖ్యంగా నా పిల్లల రోగనిరోధక శక్తికి గేమ్-ఛేంజర్‌గా ఉంది! వెండిలో సహజ యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి నీటిని తాజాగా, హానికరమైన బ్యాక్టీరియా లేకుండా ఉంచుతాయి. ఇది పిల్లల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ప్రతిరోజూ స్వచ్ఛమైన, శుభ్రమైన నీటిని తాగేలా చేస్తుంది. జీవక్రియకు సంబంధించిన వ్యాధులను అరికడుతుంది. నీటితో కలిగే వ్యాధులతో పోరాడుతుంది. చర్మానికి ప్రయోజనకరంగా ఉంటుంది. సెల్యులార్ ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది”అని పరేఖ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టారు. సాధారణంగా వెండికి శీతలీకరణ లక్షణాలు ఉంటాయి. ఇవి అదనపు వేడిని సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. ఒత్తిడిని జయించి మనసుకు ప్రశాంతతను చేకూరుస్తుంది. మానసిక స్థిరత్వం లభిస్తుంది. శరీరంపై వెండిని ధరించడం వల్ల శక్తిని సమతుల్యం చేసే ప్రభావాన్ని కలిగి ఉందని, శక్తిని ప్రోత్సహిస్తుందని మరియు మానసిక మరియు శారీరక శక్తిని పెంచుతుందని నమ్ముతారు. వెండితో శుద్ధి చేసిన నీటిని నిరంతరం తీసుకోవడం వల్ల సెల్యులార్ ఆరోగ్యానికి మద్దతు లభిస్తుంది, ఇది దీర్ఘకాలిక ఆరోగ్యానికి దారితీస్తుంది” అని పరేఖ్ పేర్కొన్నారు. అయితే నీటిలో వేసే వెండినాణెం 99 శాతం స్వచ్ఛమైన వెండితో తయారు చేయబడి ఉండాలి. మలినాలు లేదా పూతలు లేకుండా ఉండేలా చూసుకోవాలి. నాణెంపై పాచు పేరుకుపోకుండా ఉండటానికి నిమ్మకాయ, బేకింగ్ సోడా వంటి సహజ క్లెన్సర్‌తో వారానికొకసారి శుభ్రం చేస్తూ ఉండాలి. నీటితో వెండి నాణెం కలిపే ముందు ఆ నీరు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. వెండి నీటి వడపోతకు ప్రత్యామ్నాయం కాదని పరేఖ్ అన్నారు.వెండి పాత్రలలో నీరు లేదా ఆహారం ప్రమాదకరం కాదని భావించినప్పటికీ, వెండి లోహాన్ని నీటిలో కలిపి తాగడం మంచిదని చెప్పలేమని లైఫ్ కోచ్ మరియు ఎనర్జీ హీలింగ్ థెరపిస్ట్ సోమా ఛటర్జీ అన్నారు. ముఖ్యంగా పిల్లలకు ఆ నీటిని తాగాలని సూచించకపోవడమే మంచిదని చెప్పారు. వెండి కలిపిన నీటిని తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు శాస్త్రీయంగా నిరూపించబడలేదు మరియు ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తాయి అని ముంబైలోని డైటీషియన్ జైనోవా షాల్బీ హాస్పిటల్ జినాల్ పటేల్ నొక్కి చెప్పారు. “వెండి కలిపిన నీటిని వాడటం వల్ల హానికరమైన దుష్ప్రభావాలు వస్తాయి. వెండి సమ్మేళనాలు తీసుకోవడం వల్ల ఆర్గిరియా వస్తుంది, ఇది తిరిగి మార్చలేని నీలం-బూడిద రంగు చర్మం రంగు మారడానికి కారణమవుతుంది. కాలేయం వంటి అవయవాలలో వెండి నానోపార్టికల్స్ పేరుకుపోవచ్చు, కాలక్రమేణా నష్టం కలిగిస్తుంది. వెండి వినియోగం నాడీ సంబంధిత నష్టానికి కూడా ముడిపడి ఉంటుంది”అని పటేల్ వాదించారు. అంతేకాకుండా, వెండి వినియోగం కొన్ని యాంటీబయాటిక్స్ మరియు మందుల ప్రయోజనాలకు ఆటంకం కలిగిస్తుంది. “వెండి కొంత జీర్ణశయాంతర చికాకు, విరేచనాలు మరియు కడుపు నొప్పిని కలిగిస్తుంది. జాగ్రత్తగా ఉండండి మరియు మీ తాగునీటిలో వెండిని ఉపయోగించకుండా ఉండండి. బదులుగా, ఆరోగ్యంగా ఉండటానికి శుభ్రమైన మరియు ఫిల్టర్ చేసిన నీటిని త్రాగండి. నిరూపించబడని నివారణలపై ఆధారపడటం మంచిది కాదు” అని పటేల్ అన్నారు.



# స్నానం నీటిలో చిటికెడు ఇది కలిపారంటే.. ఊహించలేనన్ని అద్భుతాలు..!



స్నానం చేయడం మన దినచర్యలో ఒక ముఖ్యమైన భాగం. కొంతమంది స్నానం చేయడానికి నీటిలో కొద్దిగా రోజ్ వాటర్ లేదా పసుపు లేదా పచ్చి పాలు కలుపుతుంటారు. దీనివల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయ. అదేవిధంగా చాలా మంది నీటిలో చిటికెడు ఉప్పు కలుపుకుని స్నానం చేస్తుంటారు. మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి అనేక ఖనిజాలతో సమృద్ధిగా ఉండే ఉప్పు శరీరానికి కూడా మేలు చేస్తుంది. నీటిలో ఉప్పు కలిపి స్నానం చేయడం వల్ల పరిసరాల నుంచి ప్రతికూల శక్తి తొలగిపోవడమే కాకుండా, శరీరానికి అనేక ప్రయోజనాలు కూడా అందుతాయి. ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం.. స్నానపు నీటిలో ఉప్పు కలిపి స్నానం చేయడం వల్ల చర్మం మురికి శుభ్రమవుతుంది. ఇది మృతకణాలను పూర్తిగా తొలగిస్తుంది. వేసవిలో చెమట వల్ల కలిగే రింగ్‌వార్మ్, దురద మొదలైన చర్మ వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చడంలో కూడా సహాయపడుతుంది. అంతే కాకుండా ఉప్పులో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు చర్మాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. పరిగెత్తేటప్పుడు, నడిచేటప్పుడు శరీరంలో ఎక్కడైనా నొప్పి అనిపిస్తే, గోరువెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ ఉప్పు కలిపి స్నానం చేయాలి. ఇది కీళ్ల నొప్పి, మోకాలి నొప్పి,వెన్నునొప్పి నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. గోరువెచ్చని నీటిలో ఉప్పు కలిపి స్నానం చేయడం వల్ల వాపు కూడా తగ్గుతుంది. ప్రతిరోజూ స్నానం నీటిలో ఉప్పు కలిపి స్నానం చేయడం వల్ల అలసట, ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది అలసటను దూరం చేసి శరీరానికి ఉత్సాహాన్ని ఇస్తుంది. ఉప్పు కలిపిన నీటితో స్నానం చేయడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపుతుంది. అదనంగా ఇది శరీరంలో మంట, దురద, వాపు వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. ఉప్పులో శుభ్రపరిచే లక్షణాలు ఉన్నందున, స్నానపు నీటిలో చిటికెడు ఉప్పు వేసి స్నానం చేయడం వల్ల శరీరం నుంచి ప్రతికూల శక్తి, మలినాలను తొలగించడంలో సహాయపడుతుంది. ముందుగా ఒక బకెట్ తీసుకొని దానిని నీటితో నింపాలి. ఈ నీటిలో ఒక టేబుల్ స్పూన్ ఉప్పు వేసి 15 నిమిషాలు అలాగే ఉంచాలి. నీటిలో ఉప్పు కలిసిన తర్వాత స్నానం చేయాలి. ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల చర్మానికి మేలు జరగడమే కాకుండా ప్రతికూల శక్తిని తొలగించడంలో కూడా సహాయపడుతుంది.

## రోజుకో దానిమ్మ పండు తినడం వల్ల శరీరంలో జరిగే మార్పులు



రోజూ ఒక దానిమ్మ పండు తినడం వల్ల గుండె అనేక ప్రయోజనాలు లభిస్తాయి. దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు శరీరాన్ని ఎన్నో వ్యాధుల నుంచి కాపాడతాయి. ఈ సూపర్‌ఫుడ్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని సాధించవచ్చు. తాజా దానిమ్మ గింజలు లేదా రసం తీసుకోవడం శరీరానికి సహజ శక్తిని, ఆరోగ్యాన్ని అందిస్తుంది. దానిమ్మ పండు రుచికరమైన రుచితోపాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే సూపర్‌ఫుడ్. ఇందులో విటమిన్ సి, విటమిన్ కె, ఫోలేట్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. రోజూ ఒక దానిమ్మ పండు తినడం వల్ల శరీరంలో జరిగే మార్పులు, దాని ఆరోగ్య ప్రయోజనాలను వివరంగా తెలుసుకుందాం. దానిమ్మలోని పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి రక్తనాళాలలో ఫలకం ఏర్పడకుండా నిరోధించి, రక్త ప్రవాహాన్ని సాఫీగా చేస్తాయి. రోజూ దానిమ్మ తినడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది, కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. దానిమ్మ రసం లేదా గింజలను తీసుకోవడం గుండెకు రక్షణ కవచంలా పనిచేస్తుంది. దానిమ్మలో విటమిన్ సి అధికంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. రోజూ ఒక దానిమ్మ తినడం వల్ల శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యం పెరుగుతుంది. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి, కణాల నష్టాన్ని నివారిస్తాయి.

## బిజినెస్

### బంగారం కొనాలనుకుంటున్నారా?



గత మూడు రోజులుగా దిగివస్తున్న బంగారం ధరలు ఈరోజు మరోసారి స్వల్పంగా తగ్గాయి. హైదరాబాద్, ఢిల్లీలో 22, 24 క్యారెట్ల బంగారం ధరలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. పెళ్లిళ్లు, శుభకార్యాలకు బంగారం కొనుగోలు చేయాలను కునేవారికి కాస్త ఊరట కలిగిస్తున్నాయి పసిడి ధరలు భారతీయ మహిళలకు బంగారం అంటే ఎంత ఇష్టం ఉంటుందో చెప్పక్కర్లేదు. ధర పెరిగినా.. తగ్గినా ఏమాత్రం లెక్కచేయకుండా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇక ఇప్పుడు పెళ్లి సీజన్ కావడంతో శుభకార్యాల కోసం బంగారం విక్రయాలు మరింత పెరిగాయి. మరోవైపు గత కొన్ని రోజులుగా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. ఇటీవల బంగారం ధర లక్షకు చేరి పసిడి ప్రియులకు షాకిచ్చిన సంగతి తెలిసిందే. కానీ వారం రోజులుగా గోల్డ్ రేట్స్ నెమ్మదిగా దిగివస్తున్నాయి. నాలుగైదు రోజుల క్రితం భారీగా పడిపోయిన పసిడి ధరలు గత మూడు రోజులుగా స్వల్పంగా తగ్గుతున్నాయి. ఇప్పుడిప్పుడే దేశీయ మార్కెట్లో గోల్డ్ రేట్స్ తగ్గుముఖం పట్టాయి. దీంతో దేశంలోని పలు ప్రధాన నగరాలు ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లోనూ బంగారం ధరలలో మార్పులు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు మరోసారి స్వల్పంగా తగ్గాయి. శుక్రవారం 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.95,510 ఉండగా.. ఈరోజు ఉదయం స్వల్పంగా తగ్గి రూ.95,500కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.87,540 వద్ద కొనసాగుతుంది. హైదరాబాద్?తోపాటు విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, నిజామాబాద్, వరంగల్ వంటి నగరాల్లోనూ ఇవే పసిడి ధరలు కొనసాగుతున్నాయి.

### ఇక అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లే



అమెరికా మార్కెట్లో ఇకపై మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లే ఎక్కువగా దర్శనమివ్వనున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అధిక వాటా భారత్ నుంచి దిగుమతి చేసుకోనున్నట్లు యాపిల్ సీఈఓ టిమ్‌కుక్ వెల్లడించారు. అమెరికాలో విక్రయించే అధిక శాతం ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాట్, ఎయిర్‌పాడ్స్‌ను వియత్నాం ప్లాంట్ల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇతర మార్కెట్లలో విక్రయించే ఐఫోన్లను మాత్రం చైనా నుంచి సమీకరించనున్నట్లు ఈ మార్చితో ముగిసిన రెండో త్రైమాసిక ఫలితాల విడుదల అనంతరం అనలిస్ట్ కాల్ కాన్ఫరెన్స్‌లో ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ సుంకాల అనిశ్చితి నేపథ్యంలో యాపిల్ ఈ నిర్ణయం తీసుకుంది. సుంకాలతో జూన్ క్వార్టర్‌లో 90 కోట్ల డాలర్ల (రూ.7,650 కోట్లు) మేర భారం పడవచ్చని కంపెనీ అంచనా వేసింది. యాపిల్ అక్టోబరు నుంచి తదుపరి సెప్టెంబరు వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ అధ్యయన నివేదిక ప్రకారం.. యాపిల్ గత ఏడాది అమెరికా మార్కెట్లో 7.59 కోట్ల ఐఫోన్లను విక్రయించింది. భారత్‌లో తయారవుతున్న యాపిల్ ఐఫోన్లలో అధిక శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. ఈ ఫిబ్రవరి 28తో ముగిసిన మూడు నెలల్లో మన ఐఫోన్ల ఎగుమతుల్లో అమెరికా వాటా 81.9 శాతంగా ఉంది. మార్చిలో ఇది 97.6 శాతానికి పెరిగింది

## ఆ ప్రభుత్వ స్టాక్‌లో పెట్టుబడితో రాబడి వరద



ప్రస్తుత రోజుల్లో పెరిగిన ఆర్థిక అక్షరాస్యత నేపథ్యంలో పెట్టుబడిదారుల ఆలోచనా విధానాలు మారాయి. ముఖ్యంగా స్థిర ఆదాయాన్ని ఇచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలతో కాకుండా రిస్క్ ఎక్కువైనా పర్లేదని మంచి రాబడినిచ్చే స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడికి తక్కువ రిస్క్ ఉండడంతో పాటు రాబడినిచ్చే మంచి స్టాక్స్ కోసం యువత అన్వేషిస్తున్నారు. ఇలాంటి వారికి ఓ ప్రభుత్వ రంగ స్టాక్ అధిక రాబడినిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అధిక రాబడి అవకాశాల కోసం చూస్తున్న పెట్టుబడిదారులు ప్రభుత్వ మద్దతు ఉన్న స్టాక్‌ను ఎంచుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కేవలం ఒక నెలలోనే 49 శాతం వరకు రాబడిని అందించిందని వివరిస్తున్నారు. ఈ కంపెనీ మార్చి త్రైమాసికంలో బలమైన పనితీరుతో మెరుగైన రాబడిని అందించింది. ముఖ్యంగా దాని శుద్ధి విభాగంలో ఇది లాభాలను, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గణనీయంగా పెంచింది. ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌ను 34 మంది విశ్లేషకులు కవర్ చేస్తున్నారు. వారిలో 22 మంది దీనికి 'కొనుగోలు' రేటింగ్ ఇచ్చారు. ఏప్రిల్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 10 డాలర్లు తగ్గితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఇండియన్ ఆయిల్ ఇన్వెంటరీ నష్టానికి దారితీయవచ్చని ఓ ప్రముఖ పరిశోధన సంస్థ తన నివేదికలో పేర్కొంది. రిఫైనింగ్ మార్జిన్‌లో కొంత బలహీనత ఉన్నప్పటికీ ఈ కంపెనీ మార్కెటింగ్ మార్జిన్‌లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. మార్చి త్రైమాసిక ఫలితాల తర్వాత నిర్వహణ లాభం అంచనాలు వరుసగా 15 శాతం నుంచి 17 శాతం వరకు ఉండవచ్చునిన ఇపుణులు చెబుతున్నారు. అలాగే ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ కూడా ఈ స్టాక్‌కు 'కొనుగోలు' రేటింగ్ ఇచ్చి దాని ప్రస్తుత ధర కంటే దాదాపు 49 వాతం ఎక్కువ ధరను రూ.205గా నిర్ణయించింది. ఇండియన్ ఆయిల్ స్టాక్‌ను 'వ్యూహాత్మక ఆట'గా మోర్గాన్ స్టాన్లీ కంపెనీ అభివర్ణించింది. ఈ స్టాక్ రాబోయే 30 రోజుల్లో గణనీయమైన లాభాలను అందిస్తుందని పేర్కొంటుంది. వంట గ్యాస్‌పై నష్టాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత స్థిరమైన ఇంధన ధరలను సంస్థ అంచనా వేస్తోంది. ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్టాక్ ఎన్ఎస్ఈలో రూ.142.50 వద్ద ట్రేడవుతోంది. అంటే దాదాపు ఇది 3.37 శాతం పెరిగింది. గత నెలలో స్టాక్ ధర దాదాపు తొమ్మిది శాతం పెరిగింది. 2025లో ఇప్పటివరకు ఇండియన్ ఆయిల్ స్టాక్ 4 శాతం బలపడింది, అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఇది 17 శాతం తగ్గింది.

## భారత వృద్ధికి యుఎస్ టారిఫ్‌ల దెబ్బ




భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా టారిఫ్‌లు ప్రతికూల ప్రభావం చూపనున్నాయని ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి అంచనాలను 20 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.3 శాతానికి పరిమితం చేసింది. వచ్చే 2026-27లోనూ వృద్ధి 6.5 శాతంగానే ఉండొచ్చని విశ్లేషించింది. ఇంత క్రితం ఈ అంచనాలు వరుసగా 6.5 శాతం, 6.7 శాతంగా ఉన్నాయి. ఇటీవల ఆర్‌బిఐ కూడా 2025-26లో భారత వృద్ధి రేటు 6.7 శాతం నుంచి 6.5 శాతానికి కోత పెట్టింది. అమెరికా విధానాలతో నెలకొన్న వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో జిడిపి అంచనాలను తగ్గిస్తున్నట్లు తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రపంచ దేశాలపై భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇది తీవ్ర మందగమనానికి దారి తీస్తుందని నిపుణులు హెచ్చరించడం, ట్రంప్ విధానాలపై సొంత దేశంలోనే తీవ్ర నిరసనలు నెలకొనడంతో పెం చిన టారిఫ్‌లను 90 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్ సహా ఇతర దేశాల వృద్ధి అంచనాలను ఎస్అండ్‌పి వెల్లడించింది. అమెరికా, కెనడా, యూరప్, జర్మనీ, ఇటలీ, చైనా, జపాన్, బ్రిటన్ దేశాలపై టారిఫ్‌ల ప్రభావం ఉంటుందని పేర్కొంది. ఈ ఏడాది అమెరికా జిడిపి 60 బేసిస్ పాయింట్లు (0.60 శాతం) తగ్గి 1.5 శాతానికే పరిమితం కానుందని పేర్కొంది. వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. "అమెరికా దిగుమతి సుంకాల పెరుగుదల, వాణిజ్య ప్రతీకారం, కొనసాగుతున్న రాయితీలు, తదనంతరం మార్కెట్‌ల అల్లకల్లోలం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలను ఆందోళనకు గురి చేస్తోన్నాయని ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ గ్లోబల్ చీఫ్, ఎకనామిస్ట్ పాల్ గ్రుయెన్ వాల్డ్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలలో వృద్ధి తగ్గుదలకు ప్రమాదం పెరిగినప్పటికీ, అలాగని భారీ మందగమనం ఉంటుందని భావించడం లేదన్నారు. అదే విధంగా ఈ సమయంలో అమెరికా మాంద్యాన్ని ఊహించలేమన్నారు.

## ప్లే-ఆఫ్స్ రేసునుంచి సన్‌రైజర్స్ ఔట్

## స్పోర్ట్స్



ప్లే-ఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలైంది. 2024 సీజన్ రన్నరప్ అయిన సన్‌రైజర్స్ జట్టు గుజరాత్ టైటాన్ నిర్దేశించిన 225 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6వికెట్లు కోల్పోయి 186పరుగులే చేయగల్గింది. అభిషేక్ శర్మ(74) అర్ధసెంచరీ మినహా మరో బ్యాటర్ రాణించలేకపోయాడు. గుజరాత్ బౌలర్లు సిరాజ్, ప్రసిధ్‌కు రెండేసి, ఇషాంత్, కోర్జేకు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ గెలుపుతో గుజరాత్ ప్లే-ఆఫ్స్‌కు చేరువ కాగా.. సన్‌రైజర్స్ మరో మూడు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ప్లే-ఆఫ్స్ రేసునుంచి నిష్క్రమించింది. అంతకుముందు గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ తృటిలో అర్ధ సెంచరీని మిస్ చేసుకోగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(76) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్(64) కూడా అర్ధ శతకం బాదడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై గుజరాత్ జట్టు 6వికెట్ల నష్టానికి 224 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. అర్ధసెంచరీకి చేరువైన సాయి సుదర్శన్‌ను యువ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఔట్ చేసి తొలి బ్రేక్ అందించాడు. కట్ షాట్ ఆడబోయిన సాయి వికెట్ కీపర్ క్లాసెన్ చేతికి చిక్కాడు. దాంతో 87 పరుగుల వద్ద గుజరాత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత జోస్ బట్లర్, శుభ్‌మన్ గిల్‌లు ధాటిగా ఆడుతూ స్కోర్ 100 దాటించారు. షమీ వేసిన 10వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన గిల్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్ల ముగిసేసరికి గుజరాత్ జట్టు వికెట్ నష్టపోయి 120 పరుగులు చేసింది. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్(48), శుభ్‌మన్ గిల్(52 నాటౌట్)లు దంచికొట్టారు. గుజరాత్ జట్టు పవర్ ప్లే 6ఓవర్లు ముగిసేసరికి వికెట్ కోల్పోకుండా 82 పరుగులు చేసింది. ఐపిఎల్ చరిత్రలో గుజరాత్‌కు తొలి ఆరు ఓవర్లలో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఇంతకుముందు 78/0 అత్యుత్తమంగా ఉండేది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు ఆరంభం నుంచే గుజరాత్ బ్యాటర్లు దూకుడు ప్రదర్శించారు. ముఖ్యంగా సాయి సుదర్శన్ కేవలం 23 బంతుల్లోనే 9 ఫోర్ల సహాయంతో 48 పరుగులు చేసి జట్టుకు వేగవంతమైన ఆరంభాన్ని అందించాడు. జీషన్ అన్సారీ బౌలింగ్‌లో కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి సుదర్శన్ పెవిలియన్ చేరాడు. మరో ఎండ్ లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా విజృంభించి ఆడాడు. గిల్ కేవలం 38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 76 పరుగులు సాధించి జట్టు స్కోరును పరుగులు పెట్టించాడు. ఉనద్కట్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో సుందర్, తెవాటియా, రషీద్ ఖాన్ (0) వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

### టీ20ల్లో సాయి సుదర్శన్ ప్రపంచ రికార్డు



టీ20ల్లో గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్ 2025లోనూ తన బ్యాటింగ్ తో సత్తా చాటుతున్నాడు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. దీంతో టీ20ల్లో ఇప్పటివరకు ఆడిన మ్యాచ్ ల్లో ఒక్క మ్యాచ్ లో కూడా డకౌట్ కాకుండా రెండు వేల పరుగులు చేసిన తొలి క్రికెటర్ సాయి సుదర్శన్ అరుదైన ఘనతను సాధించాడు. నిన్న రాత్రి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్ లో సుదర్శన్ ఈ ఫీట్ నెలకొల్పాడు. అంతేకాదు, టీ20ల్లో భారత్ తరుపున అత్యంత వేగంగా 2 వేల పరుగులు చేసిన క్రికెటర్ గానూ సాయి రికార్డు నెలకొల్పాడు. కేవలం 54 ఇన్నింగ్స్ లో ఈ ఫీట్ సాధించి సాయి సుదర్శన్ తొలి స్థానంలో ఉండగా.. 59 ఇన్నింగ్స్ లో ఈ ఘనత సాధించిన సచిన్ టెండూల్కర్ రెండో స్థానంలో నిలిచారు. ఓవరాల్ గా సాయి రెండో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా బ్యాటర్ మార్ష్ మొదటి స్థానంలో ఉన్నాడు. కాగా, నిన్న జరిగిన మ్యాచ్ విషయానికి వస్తే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ గుజరాత్ 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్.. శుభ్‌మన్ గిల్(76), జోస్ బట్లర్(64), సాయి సుదర్శన్(48)లు బ్యాటింగ్‌తో చెలరేగడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సన్‌రైజర్స్ జట్టును గుజరాత్ బౌలర్లు 186/6 పరుగులకే కట్టడి చేశారు. సన్‌రైజర్స్ బ్యాటర్లలో అభిషేక్ శర్మ(74) తప్ప మరెవరూ రాణించలేక పోయారు. ట్రావీస్ హెడ్(20), హెన్రిచ్ క్లాసెన్(23), నితీశ్ రెడ్డి(20)లు తక్కువ స్కోరుకే ఔటయ్యారు. గుజరాత్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లు పడగొట్టగా.. ఇశాంత్ శర్మ, కోయెట్జి తలో వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో పాయింట్స్ టేబుల్ లో గుజరాత్ రెండో స్థానానికి చేరుకుంది.

### దక్షిణాఫ్రికాపై శ్రీలంక గెలుపు



మహిళల ముక్కోణపు సిరీస్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు శుభారంభం చేసింది. ప్రేమదాస స్టేడియంలో దక్షిణాఫ్రికా మహిళలతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను శ్రీలంక బౌలర్లు మల్కి మధరా(4/50), విహంగ(3/41) రాణించారు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 235పరుగులే చేసింది. లారా గుడైల్(46), ట్రయాన్(35), లూస్(31)కి తోడు డెర్క్‌సన్(61) అర్ధసెంచరీతో ఆదుకున్నారు. ఆ లక్ష్యాన్ని శ్రీలంక మహిళల 46.3ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించారు. ఓపెనర్, కెప్టెన్ ఆటపట్టు(6) నిరాశపరిచినా.. పెరీరా(42), గుణరత్నే(29) ఆదుకున్నారు. వీరిద్దరికి తోడు హర్షిత(77), కవిషా దిల్హారి(61) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. దీంతో శ్రీలంక జట్టు 46.3ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 237పరుగులు చేసి విజయం సాధించింది. దక్షిణాఫ్రికా బౌలర్లు మాబాకు రెండు, క్లాస్, క్లార్క్, లూస్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్షితకు దక్కింది. ఆదివారం భారత్-శ్రీలంక జట్ల మధ్య రెండో లీగ్ మ్యాచ్ జరగనుంది.



## 'హిట్ 3'తో రెండు రికార్డులు బ్రేక్ చేసిన నాని

హీరో నాని నుంచి లేటెస్ట్ గా 'హిట్ 3' సినిమా వచ్చింది. మే 01న రిలీజైన ఈ చిత్రానిక రెండు రోజుల్లోనే రూ.62 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. మూవీపై కొందరికి నచ్చనప్పటికీ.. ఓవరాల్ గా మాత్రం థియేటర్లకు జనాలు వెళు_న్నారు. ఈ క్రమంలోనే నాని రెండు సరికొత్త రికార్డ్స్ సృష్టించాడు. గత కొన్నాళ్ల నుంచి తన ప్రతి సినిమాతో ఆకట్టుకుంటున్న నాని.. ఓవర్సీస్ అంటే విదేశాల్లోనూ తెలుగు ప్రేక్షకుల్ని ఫుల్ గా ఎంటర్ టైన్ చేస్తున్నాడు. హిట్ 3తో వరసగా 11వ సారి మిలియన్ మార్క్ వసూళ్లు సాధించాడు. ఈ క్రమంలోనే మహేశ్ బాబు సరసన చేరాడు. ఇంతకు ముందు మహేశ్ ఈ ఘనత సాధించాడు. మరోవైపు 5 కంటే ఎక్కువగా 1.5 మిలియన్ డాలర్ వసూళ్లు సాధించిన హీరోగానూ నాని నిలిచాడు. ఈ లిస్టులో ఇంతకు ముందు మహేశ్ బాబు, ప్రభాస్, అల్లు అర్జున్, ఎన్టీఆర్ ఉన్నారు. ఇప్పుడు నాని కూడా వాళ్లతో చేరిపోయాడు. నాని అందరూ మీడియం రేంజ్ హీరో అంటున్నారు గానీ ఓవర్సీస్ లో వసూళ్లు చూస్తుంటే స్టార్ హీరోలకు ఏ మాత్రం తగ్గట్లేదని అనిపిస్తుంది. హిట్ 3 విషయానికొస్తే.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కంటే వయలెన్స్ ఎక్కువుందనే టాక్ వస్తోంది. నాని కూడా ఈ విషయం ముందే చెప్పాడు. కాబట్టి ఈ తరహా రక్తపాతం సినిమాలు నచ్చేవాళ్లు హిట్ 3కి వెళ్తున్నారు. దీని తర్వాత అంటే త్వరలో 'ద ప్యారడైజ్' సెట్స్ లో నాని అడుగుపెట్టబోతున్నాడు. అనంతరం డైరెక్టర్ సుజీత్ తో ఓ మూవీ చేస్తాడు.



## అల్లు అర్జున్ బాడీ ట్రాన్స్ఫర్మేషన్ కోసం బరిలోకి దిగిన ప్రముఖ ఫిట్‌నెస్ ట్రైనర్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు. కోలీవుడ్ సంచలన దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకంగా కసరత్తులు చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ యొక్క స్క్రిప్ట్ కూడా పూర్తయింది. అంతేకాకుండా, అల్లు అర్జున్ ఈ చిత్రంలో మూడు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ ఫిట్‌నెస్ ట్రైనర్ లాయిడ్ స్టీవెన్స్ ఈ సినిమా కోసం అల్లు అర్జున్‌కు శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. స్టీవెన్స్‌కు టాలీవుడ్‌లో మంచి అనుభవం ఉంది. గతంలో ఆయన ఎన్టీఆర్, మహేష్ బాబు వంటి స్టార్ హీరోలతో కలిసి విజయవంతమైన చిత్రాలకు పనిచేశారు. టాలీవుడ్ సర్కిల్లో ఆయన అనుభవజ్ఞులైన ఫిట్‌నెస్ నిపుణులు. అయితే తాను అల్లు అర్జున్‌తో పని చేయబోతున్నట్లు స్టీవెన్స్ వెల్లడించాడు. ఈ విషయాన్ని స్వయంగా లాయిడ్ స్టీవెన్స్ ఈరోజు – ద్వారా ధృవీకరించారు. అల్లు అర్జున్‌తో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఏఏ22 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఒక శక్తివంతమైన డాన్ మరియు మాఫియా నేపథ్యంలో సాగుతుందని సమాచారం. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. యువ తమిళ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. అల్లు అర్జున్ మరియు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. లాయిడ్ స్టీవెన్స్ రాకతో అల్లు అర్జున్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారని అభిమానులు ఆశిస్తున్నారు.



## ఓటీటీలో రాబిన్?హుడ్.. ప్రకటనతో క్లారిటీ

నితిన్, శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటించిన రాబిన్?హుడ్ మూవీ ఓటీటీలోకి రానుంది. ఈ ఏడాదిలో మార్చి 28న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచింది. వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మంచి అంచనాలతో థియేటర్స్‌లోకి వచ్చింది. అయితే, మొదటిరోజే మిక్స్ టాక్ రావడంతో అనుకున్నంత కలెక్షన్స్ రాబట్టలేకపోయింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేనీ, రవిశంకర్ ఈ మూవీని నిర్మించారు. ఇందులో నితిన్, శ్రీలీలతో పాటు రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్, కేతిక శర్మ మెప్పించగా.. ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ క్యామియో రోల్‌తో కనిపించారు. రాబిన్?హుడ్ సినిమా జీ తెలుగు టీవీ ఛానెల్?లో మే 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రసారం కానున్నట్లు ఒక పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుంది. అయితే, జీ5 ఆప్‌కమింగ్ సినిమాల విభాగంలో మే 10న ఓటీటీ విడుదల కానుందని ఒక ప్రకటన ఉంది. కొద్దిరోజులుగా జీ నెట్‌వర్క్ ఇలాంటి స్ట్రాటజీనే అమలు చేస్తోంది. కొత్త సినిమాలను టీవీ ప్రీమియర్, ఓటీటీ స్ట్రీమింగ్‌కు ఒకేసారి విడుదల చేస్తుంది. గతంలో సంక్రాంతికి వస్తున్నాం సినిమా విషయంలో కూడా ఇదే ప్లాన్‌ను జీ తెలుగు అమలు చేసింది. ఇప్పుడు రాబిన్‌హుడ్ చిత్రం విషయంలోనూ దానిని అమలు చేస్తున్నట్లు అర్థం అవుతుంది. మే 10 నుంచి జీ తెలుగు ఓటీటీలో ఈ మూవీ స్ట్రీమింగ్ కానున్నట్లు ఫైనల్ అయింది. సుమారు రూ. 50కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 10 కోట్లు కూడా రాబట్టలేదని టాక్. రామ్ (నితిన్) అనాథ. చిన్నప్పుడు అతన్ని ఓ పెద్దాయన హైదరాబాద్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో చేర్పిస్తాడు. అక్కడ తినడానికి తిండిలేక ఇబ్బందిపడుతున్న తోటి పిల్లల కోసం దొంగగా మారతాడు. పెద్దయ్యాక 'రాబిన్‌హుడ్' పేరుతో ధనవంతుల ఇళ్లలో చోరీలు చేస్తుంటాడు. అతన్ని పట్టుకోవడం కోసం రంగంలోకి దిగిన పోలీసు అధికారి విక్టర్(షైన్ చాం టాకో) ఈగోని దెబ్బతీస్తూ ప్రతిసారి దొరికినట్లే దొరికి తప్పించుకుంటాడు. దీంతో విక్టర్ రాబిన్‌ని పట్టుకోవడమే టార్గెట్‌గా పెట్టుకుంటాడు.



## ఎవరినీ బాధపెట్టే ఉద్దేశం తనకు లేదు

### ట్రైబల్ వ్యాఖ్యలపై క్షమాపణలు తెలిపిన విజయ్ దేవరకొండ

టాలీవుడ్ సినీ నటుడు విజయ్ దేవరకొండ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయిన విషయం తెలిసిందే. గత నెల 26న జరిగిన తమిళ హీరో సూర్య నటించిన 'రెట్రో' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. ట్రైబల్ అనే పదం వాడడు. అయితే ఈ వ్యాఖ్యలు ఆదివాసులను అవమానించేలా ఉన్నాయని ట్రైబల్స్ లాయర్స్ అసోసియేషన్ బాపూనగర్ అధ్యక్షుడు కిషన్‌రాజ్ చౌహాన్ ఆరోపించడంతో పాటు హైదరాబాద్ లోని ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గిరిజనులను అవమానించేలా మాట్లాడడం దారుణమని, విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు ఈ వ్యాఖ్యలను పలు ఆదివాసి సంఘాలు తప్పుబట్టడమే కాకుండా క్షమాపణలు చెప్పాలని కోరాయి. తాజాగా ఈ వివాదంపై విజయ్ దేవరకొండ క్షమాపణలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ తెగల వారిని తాను ఎంతో గౌరవిస్తానని, వారిని దేశంలో అంతర్భాగంగా భావిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఎవరినీ బాధపెట్టే లేదా లక్ష్యంగా చేసుకునే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని విజయ్ తేల్చి చెప్పారు. అలాగే దేశం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చే సమయంలో, తన సోదరుల వలె భావించే భారతీయులలో ఏ ఒక్క వర్గాన్ని కూడా తాను ఉద్దేశపూర్వకంగా ఎలా వేరు చేస్తానని ఆయన ప్రశ్నించారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com